ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 36.0
కనిష్ఠం : 28.0



రవాణా శాఖలో సిబ్బంది కొరత

రోజు రోజుకూ పెరుగుతున్న వాహనాలు

21 పోస్టులు ఖాళీ.. ఉన్నవారిపైనే భారం

ఏలూరు క్రైం,జూన్ 18 : రవాణ శాఖను సిబ్బంది కొరత వెంటాడుతోంది. ఎన్నో ఏళ్ల క్రితం వాహనాల పరిస్థితిని బట్టి రవాణాశాఖలో పోస్టులను కల్పించారు. ప్రస్తుతం రోజురోజుకూ వాహనాలు పెరుగుతున్నాయి. ఆ మేరకు సిబ్బంది పెరగకపోవడంతో ఉన్న వారిపైనే భారం పడుతోంది. జిల్లాలో రోడ్డు ప్రమాదాలు నియంత్రించడానికి, వాహనాల ఫిట్‌నెస్‌ను పరీక్షించడానికి, తనిఖీలు చేయడం వంటి విధులను నిర్వర్తిస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకూ 80 వేల 281 ట్రాన్స్‌పోర్టు వాహనాలు రిజిస్టర్ అయి ఉండగా, నాన్ ట్రాన్స్‌పోర్టు వాహనాలు ఏడు లక్షల 34 వేల 731 ఉన్నాయి.వాహనాల రిజిస్ట్రేషన్లతో పాటు ట్రాన్స్‌పోర్టుకు సంబంధించిన వాహనాల ఫిట్‌నెస్‌లు నిత్యం తనిఖీలు చేయాల్సి ఉంది. జిల్లాలో రోజురోజుకూ వాహనాల సంఖ్య పెరిగిపోతూనే ఉంది. కాని ఆ విధులు నిర్వర్తించడానికి సిబ్బంది అంతంతమాత్రంగానే ఉన్నారు. ఐదు సంవత్సరాలుగా ఒక్క పోస్టు భర్తీ చేయలేదు.ఏలూరులో డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ కార్యాలయం, ఆర్టీవో ఆఫీస్ (రోడ్డు ట్రాన్స్‌పోర్టు అథార్టీ), జంగారెడ్డిగూడెం, నూజివీడులో కూడా ఆర్టీవో కార్యాలయం ఉంది. జిల్లాలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఆరు పోస్టులకు రెండు ఖాళీగానే ఉన్నాయి. అసిస్టెంట్ మోటారు వెహికల్ పోస్టులు 15 ఉండగా కేవలం ఏడుగురు మాత్రమే ఉన్నారు. ఎనిమిది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ట్రాన్స్‌పోర్టు కానిస్టేబుల్ పోస్టులు 11 ఉండగా 11 ఖాళీగానే ఉన్నాయి. చివరకు జిల్లా హోంగార్డ్ విభాగం నుంచి రవాణాశాఖ 17 మందిని డిప్యూటేషన్‌పై తెచ్చుకుని వారిచేత వాహనాలను తనిఖీ చేసే సమయంలోనూ ఇతర విధుల్లోనో వారి సేవలను వినియోగించుకుంటున్నారు. జిల్లాలో స్పెషల్ డ్రైవ్‌లు చేయాలన్న సిబ్బంది అంతంత మాత్రంగానే ఉన్నారు. అయినప్పటికీ ఉన్న సిబ్బందితోనే విధులను నిర్వర్తిస్తున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం



జిల్లాలో 80 వేల 281 ట్రాన్స్‌పోర్టు వాహనాలు ఉన్నాయి. ఏడు లక్షల 34 వేల 731 నాన్ ట్రాన్స్‌పోర్టు వాహనాలు ఉన్నాయి.జిల్లాలో ప్రమాదాలు ఎక్కువగా ఎక్కడ జరుగుతున్నాయో గుర్తించాం. ప్రస్తుతం జిల్లాలో 23 బ్లాక్‌స్పాట్స్‌ను గుర్తించాం. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకునే నిమిత్తం ఆర్అండ్‌బీ అధికారులకు ప్రతిపాదనలు పంపించాం. జిల్లాలో సిబ్బంది కొరత ఇబ్బందిగానే ఉన్నప్పటికీ ఉన్న సిబ్బందితోనే విధులను నిర్వర్తిస్తున్నాం. జిల్లాలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకోసం ఉన్నతాధికారులకు నివేదికలను పంపించాం.

- ఎస్.శాంతకుమారి, డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్, ఏలూరు

కేంద్ర మంత్రిగా శ్రీనివాసవర్మ బాధ్యతల స్వీకరణ

జిల్లా నుంచి భారీగా వెళ్లిన కూటమి నేతలు

భీమవరం టౌన్, జూన్ 18 : కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రిగా నరసాపురం ఎంపీ భూపతిరాజు శ్రీనివాసవర్మ మంగళవారం ఉదయం 11 గంటల 11 నిమిషాలకు న్యూఢిల్లీలోని తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. పురోహితులు వేలూరి వెంకట్రామయ్యశర్మ(జమిందార్), యామిజాల కృష్ణశర్మ పూజలు చేసి ఆశీర్వచనాలు అందించారు. జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు తరలివెళ్లారు. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు పితాని సత్యనారాయణ, బొలిశెట్టి శ్రీనివాస్, ఆరిమిల్లి రాధాకృష్ణ, బొమ్మిడి నాయకర్, విష్ణుకుమార్‌రాజు, మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు, మాజీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయచౌదరి, ఉండి జనసేన ఇన్‌చార్జ్ జుత్తుగ నాగరాజు, కోరా రామ్మూర్తి నాయుడు తదితరులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు.



మంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తూ సంతకం చేస్తున్న శ్రీనివాసవర్మ

దేనికైనా రెడీ

ఇచ్చిన మాట నిలబెట్టుకునే దిశగా కూటమి అడుగులు

కూటమి ఎమ్మెల్యేలు, ఎంపీలు అధికారికంగా కొలువుతీరే సన్నాహాల్లో ఉన్నారు. ఈనెల 21న ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేయ బోతున్నారు. తమ నియోజకవర్గాల్లో పార్టీతో సమాంతరంగా తమదైన ముద్ర ఉండేలా ఇప్పటినుంచే జాగ్రత్త పడుతున్నారు. ఎన్నికల సమయంలో తాము ఇచ్చిన హామీలను క్రోడీకరించి ఏవి ముందు..ఏవి తర్వాత చేయాలో ప్రయారిటీ ఇచ్చేలా జాగ్రత్త పడుతున్నారు. ఇంకోవైపు ఓటమి చవి చూసిన వైసీపీ నియోజకవర్గాల వారీగా ఎక్కడ ఏ ఆధారం దొరికినా విరుచుకుపడాలనే వ్యూహానికి పదును పెడుతోంది.

- కొత్త టీము..సరికొత్త ప్లానింగ్
- ఇన్ఫోసిస్‌లో ఉద్యోగాల కల్పనకు ఎంపీ మహేష్ శ్రీకారం
- దెందులూరులో పారిశుధ్యానికి చింతమనేని ప్రాధాన్యం
- ఏలూరులో గంజాయి పని పట్టడమే చంటి లక్ష్యం
- స్థానిక సమస్యలపై దృష్టి పెట్టిన మిగతా ఎమ్మెల్యేలు
- పదవీ ప్రమాణం చేసిన తరువాత క్షేత్రస్థాయిలోకి..
- కూటమి తప్పులెంచే పనిలో వైసీపీ

(ఏలూరు, ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

కూటమిపక్షాన ఏకపక్షంగా గెలుపొందిన ఎమ్మెల్యేలంతా ఈ ఐదేళ్లు తాము ఎలా ముందువరుసలో ఉండాలో ప్రజలు ఆశించినట్లుగా తాము ఏం చేయదలుచుకున్నామో స్పష్టత ఇచ్చేలా జాగ్రత్తగా వ్యవహరించాలని ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చారు. ఈ దిశగానే అటు చంద్రబాబు, పవన్‌కల్యాణ్, పురంధరేశ్వరిలు స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు.వివాదాల్లోకి వెళ్లకుండా అనవసర రాద్ధాంతాలకు తావులేకుండా ప్రజల పక్షాన పారదర్శకతతో పనిచేయాలని ఇంతకు ముందే చెప్పారు. ఏలూరు లోక్‌సభ స్థానం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కూటమిపక్షాన ఎమ్మెల్యేలంతా గెలిచారు. ఒక్కో నియోజకవర్గంలో అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వంలో పనులేవీ జరగకపోగా అంతకంటే మించి అనవసర విధ్వంసం జరిగింది. దీని నుంచి బయటపడేలా చర్యలు చేపట్టాలని భావిస్తున్నారు. ఏలూరు నియోజకవర్గంలో ప్రధాన సమస్యలు అనేకం. దీంతో సమాంతరంగా గంజాయి వినియోగం. వేలాది మంది యువ తను తప్పుదారి పట్టిస్తోంది. దీన్ని నుంచి రక్షించటానికి తొలుత రంగంలోకి దిగుతానని, ఇంతకు ముందే ఏలూరు నుంచి బడేటి చంటి ప్రకటించారు. జిల్లాకేంద్రమైన ఏలూ రులో ఉద్యోగులతో పాటు విద్యార్థులు ఎక్కువే. చిన్న, మధ్య తరగతి కుటుంబాలు అత్యధికం. షాపింగ్‌మాల్, వివిధ దుకాణాల్లో పనిచేసేవారి సంఖ్య అపరిమితం. వీరిలో ఇప్పటికే కొందరు గంజాయికి అలవాటు పడడంతో ఆయా కుటుం బాలు డీలా పడ్డాయి. ఎమ్మెల్యే బడేటి చంటికి ఏలూ రులో తొలి ఛాలెంజ్ గంజాయి నిర్మూలనే.ఇలా రకరకాల సమస్యలు అన్ని నియోజకవర్గాల్లోనూ పెండింగ్‌లో ఉన్నాయి. ఒకవైపు గత ఎమ్మెల్యేలు చూసీ చూడనట్లుగా వదలేసినవి, జగన్ ప్రభుత్వం పట్టించుకోలేనివి, ఇంకోవైపు స్థానికంగా ఉన్న చిన్న సమస్యలు కూడా పెండింగ్‌లో పెట్టారు. ఇప్పుడు వీటన్నింటిపైన కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు అంతా దృష్టి పెడుతున్నారు. ఇప్పటికే చాలామంది ఎమ్మెల్యేలు తమ అంత రంగిక సిబ్బందిని నియమించుకున్నారు. ఈలోపే ప్రమాణ స్వీకార తేదీ కూడా దగ్గర పడింది. ఎమ్మెల్యేలుగా ఎన్నికైన తరువాత శాసనసభ్యునిగా ప్రమాణస్వీకారం చేయాల్సి ఉంది.

జాగ్రత్త వహించకపోతే ముప్పే

గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పు ఒప్పులను గమనించడంతో పాటు అప్పట్లో స్థానిక ఎమ్మెల్యేలు వ్యవహరించిన తీరు అధికారుల ఒంటిపోకడ చర్యలు, పోలీసుల ఏకపక్ష విధానాల వల్లే వైసీపీ తుడిచిపెట్టుకుయింది. ఇలాంటి సమ యంలో ఎమ్మెల్యేలుగా ఎంపికైన కొత్తతరం వారికి రానున్న ఐదేళ్లు ఒక సవాలే. ఇప్పటినుంచే రోజువారి ప్రణాళికలు సిద్ధం చేసుకుని, క్షేత్రస్థాయిలో పనులు ఎలా చక్కబెట్టాలో కూడా తుదినిర్ణయం రావాల్సి ఉంది. ఇప్పటికే కొందరు ఎమ్మెల్యేలు అయితే తమ రోజువారి వ్యవహారాలు, ప్రభుత్వ పనులను చక్కపెట్టేందుకు అనుభవం, అనువైన వారిని తమ చెంతకు చేర్చుకున్నారు. ఏలూరు జిల్లాలో మంత్రిగా ఉన్న కొలుసు పార్థసారధికి అత్యంత కీలకమైన గృహనిర్మాణం, ఐఅండ్‌పీఆర్ శాఖలను అప్పగించారు. ఏలూరు జిల్లాలో ఏకైక మంత్రిగా ఉన్న పార్థసారధి మిగతా వారందర్ని కలుపుకుపోయి కూట మిపక్షాన అన్ని నియోజకవర్గాల్లోనూ పరిస్థితి చక్కదిద్దాల్సిన అవసరం ఉంది. ఏలూరు జిల్లాకు అత్యంత కీలక మైంది. పోలవరం ప్రాజెక్టు, చింతలపూడి ఎత్తిపోతలు, వీటితో పాటు మెట్టప్రాంతంలో ఉన్న ఎర్రకాలువ అత్యంత ప్రధాన మైనది. వీటిని తక్షణం ఒక గాడిన పెట్టే దిశగా ప్రభుత్వం సంసిద్ధమవుతున్నందున గడిచిన ఐదేళ్లలో ఈ రెండింటి పరి ధిలో బాధిత రైతులు ఉన్నారు. వారికి రావాల్సిన పరిహారం ఇంకా చేతికి అందలేదు. ఈ రెండు అంశాలు అటు చింతల పూడి, ఇటు పోలవరం నియోజక వర్గాల్లో దాగే ఉన్నాయి. దీంతో ఎమ్మెల్యేలు చిర్రిబాలరాజు, రోషన్‌కుమార్‌లకు ఈ రెండు పథకాలు కూడా కత్తిమీద సాముగానే భావిస్తున్నారు. దెందులూరు నియోజక వర్గంలో సీనియర్ ఎమ్మెల్యే అయిన చింతమనేని ప్రభాకర్ ఇప్పటికే తమదైనశైలిలో గ్రామాలవారీ పారిశుద్యం మెరుగుదలకు రంగంలోకి దిగారు. తనకు ఫలితాలు కావాలని, కబుర్లు అవసరం లేదని స్పష్టమైన సంకే తాలు ఇచ్చారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగు పడాల్సిం దేనని ఆదేశించారు. కైకలూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ కాస్తంత అనారోగ్యం నుంచి తేరుకున్న వెంటనే కైకలూరులో అభివృద్ధి, సంక్షేమ విష యంలో స్పీడుగా ఉంటారని భావిస్తున్నారు. ఎంపీ పుట్టా మహేష్‌యాదవ్ అప్పుడే తాను ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కొన్నింటిని అమలు చేయటానికి రంగం సిద్ధం చేసు కున్నారు. దీనిలో భాగంగానే యువతకు ఉద్యోగాలు ఇస్తానని, తాను ఇచ్చిన హామీలో భాగంగా కీలకమైన ఇన్ఫోసిస్‌లో చోటుదక్కేలా కొందరు అభ్యర్థులను ఇప్పటికే ప్రోత్సహిస్తున్నారు. ఇన్ఫోసిస్ సిబ్బందితో టచ్‌లో ఉండి స్థానికులకు పోస్టింగ్‌లు దక్కేలా చర్యలు ప్రారంభించారు. దీంతో ఏలూరు లోక్‌సభ స్థానంలోని నిరుద్యోగ యువత హర్షం వ్యక్తం చేస్తుంది.

కాపుకాసిన వైసీపీ

సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి చవిచూసిన వైసీపీ కూటమి ఎమ్మెల్యేలు చేసే పనులు అన్నింటిపైన ఓ కన్నేసి ఉంచ బోతున్నారు. తప్పిదాలను లెక్కించబోతున్నారు. ఎవరెవరు ఎక్కడెక్కడ ఏరీతిలో వ్యవహరిస్తున్నారో గమనించి ఆ మేరకు అది బహిర్గతం చేసేలా వ్యూహానికి పదును పెడుతున్నారు.



కంపెనీ ప్రతినిధులకు దరఖాస్తులు అందజేస్తున్న ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్

స్థానిక యువతకు ఉద్యోగాలు

ఏలూరు రూరల్, జూన్ 18: ఏలూరు ఎంపీ పుట్టామహేష్ స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాల కోసం వచ్చిన దరఖాస్తులను మంగళవారం హైదరాబాద్‌లో ఉన్న ఇన్ఫోసిస్ కంపెనీతో మాట్లాడారు. నిరంజన్, అరవింద్, అభిరామ్, లక్ష్మణరావు, గద్దెప్రశాంత్, సుజిత్ దరఖాస్తులు అందించగా వాటిని ఇన్ఫోసిస్ కంపెనీ సిబ్బందికి అందజేశారు. వారంలోగా ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలు వచ్చేలా చూస్తామని ఎంపీకి ప్రతినిధులు హామీ ఇచ్చారు.

53.81 శాతం ఉత్తీర్ణత

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 18 : ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షల ఫలితాల్లో జిల్లాకు 53.81 శాతం ఉత్తీర్ణత వచ్చింది. మే 24 నుంచి ఈ నెల ఒకటో తేదీవరకు జరిగిన సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. జిల్లాలో ఈ పరీక్షలకు మొత్తం 3,096 మంది విద్యార్థులు హాజరవగా రెగ్యులర్ విభాగంలో 1666 మంది, ఒకేషనల్ కోర్సుల నుంచి మొత్తం 541 మందిలో 322 మంది ఉత్తీర్ణులయ్యారు. సప్లిమెంటరీ పరీక్షల్లో జిల్లాకు లభిం చిన ఉత్తీర్ణతకంటే మార్చిలో జరిగిన రెగ్యులర్ పరీక్ష ల్లోనే అధికంగా నమోదు కావడం గమనార్హం. సప్లి మెంటరీ ఉత్తీర్ణతలో రెగ్యులర్ విద్యార్థులు అత్యధికంగా 1,134 మంది అన్‌ఎయిడెడ్ ప్రైవేటు జూనియర్ కళాశాలల నుంచి ఉండగా, అత్యల్పంగా 17 మంది ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలల నుంచి ఉన్నారు. హైస్కూల్ ప్లస్ (జడ్పీ జూనియర్ కళాశాల)ల్లో ప్రారంభించిన ఇంటర్‌లో చేరిన విద్యార్థినులు మార్చిలో జరిగిన రెగ్యులర్ పరీక్షల్లో ఆశించిన ఫలితాలను కనబరచకపోగా సప్లిమెంటరీ పరీక్షల్లో మాత్రం 51.67 శాతం ఉత్తీర్ణతతో 31 మంది పాసవడం విశేషం. ఉత్తీర్ణులందరికీ ఈనెల 30వ తేదీనాటికి సంబంధిత కళా శాలల నుంచి పాస్ సర్టిఫికెట్లు అందజేస్తామని ఇంటర్ బోర్డు అధికారులు ప్రకటించారు. రీ-వెరిఫికేషన్‌కు సబ్జెక్టుకి రూ.వెయ్యి చెల్లించి ఈ నెల 20 నుంచి 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఎంతమంది బడిబాట పట్టారు ?

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 18 : బడి బయటవున్న పిల్లలకోసం చేపట్టిన 'నేను బడికి పోతా' ప్రత్యేక డ్రైవ్‌ను జూలై 12 వరకు నిర్వహించాలని సమగ్రశిక్ష జిల్లా ఏపీసీ బి.సోమశేఖర్, ఏఎల్ఎస్ కో-ఆర్డినేటర్ రాదాకృష్ణ ఓ ప్రకటనలో హెచ్ఎంలు, ఎంఈవోలను ఆదేశించారు. మంగళవారం ఎంఈవోలతో నిర్వహించిన వెబెక్స్‌లో ఆయన మాట్లాడుతూ స్పెషల్ డ్రైవ్ ద్వారా పాఠశాలల్లో చేరుతున్న పిల్లల వివరాలను రోజువారీగా మధ్యాహ్నం 3 గంటల్లోగా గూగుల్ స్ప్రెడ్ షీట్‌లో నమోదు చేయాలన్నారు. వీటిని కలెక్టర్, డీఈవోలకు రోజువారీ నివేదిక రూపంలో పంపించాలని కోరారు. ఈ కార్యక్రమాలకు సీఆర్పీలు, ఐఈఆర్పీలు, కేజీబీవీ టీచర్లు, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, పార్ట్‌టైం టీచర్లు, వార్డు వలంటీర్ల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. కాంప్లెక్స్ హెచ్ఎంలు, టీచర్లు, పేరెంట్స్ కమిటీల ద్వారా డోర్‌టూ డోర్ సర్వేచేసి పిల్లలను బడిబాట పట్టించాలని సూచించారు.



కళాశాలలో ప్రారంభమైన అడ్మిషన్లు

దేవస్థానం కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

ద్వారకాతిరుమల, జూన్ 18: ద్వారకా తిరుమల శ్రీవారి దేవస్థానానికి చెందిన కామవరపుకోటలోని శ్రీవెంకటేశ్వర జూనియర్ కాలేజీలో మంగళవారం అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. నాలుగు దశాబ్దాల చరిత్ర కల్గిన ఈ కాలేజీపై వైసీపీ ప్రభుత్వ ఎయిడెడ్ ప్రభావం పడింది. దేవస్థానం వారు విద్యార్థులు రావడం లేదని ఈ ఏడాది అడ్మిషన్లు నిలుపుదల చేశారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో ఈనెల 16న 'ఎయిడెడ్‌పై వేటు' శీర్షికన ఓ కథనం వెలువడింది. ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్, చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ తదితరుల కృషితో దేవస్థానం చైర్మన్ సుధాకరరావు కళాశాలను ప్రారంభించాలని ఆదేశాలిచ్చారు. దీంతో మంగళవారం అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి.

ఉద్యోగ, ఉపాధ్యాయులపై అక్రమ కేసులను రద్దుచేయాలి

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 18 : ఉద్యోగులు, ఉపాధ్యాయులపై గత ప్రభుత్వం అన్యాయంగా బనాయించిన పోలీసు కేసులను కొత్తగా అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం రద్దుచేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వై.దేముడు, ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ శర్మ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉద్యోగులకు జరిగిన అన్యాయాలను సరిచేయాలన్నారు. మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్నామన్నారు.



మద్దికి భక్తుల తాకిడి

జంగారెడ్డిగూడెం, జూన్ 18 : గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రీతికరమైన తమల పాకులతో అష్టోత్తర పూజలు చేశారు. వివిధ సేవల రూపంలో దేవస్థానానికి రూ.2,25,291 ఆదాయం సమకూరినట్లు ఈవో ఆకుల కొండలరావు తెలిపారు.

పశువుల కడుపు చల్లగా..

ఉపాధి హామీలో గడ్డిమొక్కల పెంపకం

పశుగ్రాస పెంపకం ద్వారా పాడి పరిశ్రమకు ప్రోత్సాహం

సన్న, చిన్న కారు రైతులకు అవకాశం



ఏలూరు సిటీ, జూన్ 18 : పశుగ్రాసం కొరతతో రైతులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఈ పరిస్థితుల్లో పాడి పరిశ్రమ అభివృద్ధి నానాటికి కుంటుపడుతోంది. ఈ పరిస్థితులను గమనించిన ప్రభుత్వం పశుగ్రాసం కోసం గడ్డి మొక్కలు పెంచడానికి మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులను రైతులకు ఉచితంగా కేటాయించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. కనీసం ఒక రైతు 25 సెంట్ల భూమి నుంచి రెండెకరాలు విస్తీర్ణం వరకు ఈ మొక్కలను పెంచుకోవచ్చు. ఒక ఎకరానికి రెండేళ్లకు సంబంధించి రూ.91 వేలు సాగు ఖర్చులుగా రైతులకు ఉపాధి నిధుల ద్వారా ఉచితంగా అందజేస్తారు. సూపర్ నేపియర్ అనే జాతికి చెందిన గడ్డి మొక్కలను రైతులకు అందజేస్తారు. రైతులు తమ పంట పొలాల్లో దుక్కు దున్ని ఈ గడ్డి మొక్కలను ఎకరానికి 12 వేల నుంచి 13 వేల కణుపులు వేసుకోవాల్సి ఉంది. ఈ కణుపులను వేసిన తర్వాత ఎరువులు వేయడంతో పాటు, కలుపు తీసి మొక్కలు పెంచడానికి ఈ నిధులు ఉపయోగపడతాయి. సన్న, చిన్నకారు రైతులు ఎంతమంది ముందుకొచ్చినా ఈ గడ్డి మొక్కలు పెంచడానికి జాతీయ ఉపాధి హామీ నిధులు కేటాయిస్తారని సంబంధిత శాఖాధికారులు చెబుతున్నారు. జిల్లాలో ఈ గడ్డి మొక్కలు పెంచడానికి 500 ఎకరాలకు సంబంధించి రైతులు ముందుకొచ్చారు. జిల్లాలో ఎవరైనా ఈ మొక్కలు పెంపకానికి ఆసక్తి ఉంటే పట్టాదార్ పుస్తకం జిరాక్స్ , ఆధార్ జిరాక్స్, 1బీ అడంగల్ కాపీ తీసుకొచ్చి దరఖాస్తు చేసుకోవాలని డ్వామా శాఖాధికారులు సూచిస్తున్నారు.



తీరనున్న పశుగ్రాసం కొరత

ఉపాధి హామీ నిధులతో సూపర్ నేపియర్ గడ్డి మొక్కలు పెంచడం ద్వారా జిల్లాలో పశుగ్రాస కొరత తీరే అవకాశాలున్నాయి. ఈ మొక్కలు పెంచడానికి ఒక్కొక్క ఎకరానికి రూ.91 వేలు ప్రోత్సాహకంగా అందజేస్తారు. రైతులు ఎవరైనా ముందుకొస్తే ఈ పశుగ్రాస మొక్కలు పెంచడానికి ప్రోత్సాహకాన్ని అందిస్తాం. జిల్లాలో ఇప్పటికే 500 ఎకరాలకు సంబంధించి సన్న చిన్నకారు రైతులు ముందుకొచ్చారు.

-ఎ.రాము,పీడీ, డ్వామా శాఖ

కురిసింది..వాన



భీమడోలు జంక్షన్‌లో పడిపోయిన పోలీస్ ఔట్‌పోస్టు

పెదవేగి/భీమడోలు/జంగారెడ్డిగూడెం జూన్ 18 : వాన కురిసింది. రైతులు ఊరట చెందారు. వర్షాకాలం ప్రారంభమైనా ఆశించిన స్థాయిలో వర్షాలు పడకపోయినా రైతులు గొట్టపు బావుల ఆధారంగా వరినాట్లు వేశారు. అల్పపీడన ద్రోణి ఏర్పడడంతో వర్షాలు పడతాయని వారం రోజులుగా ఎదురు చూస్తున్న రైతులకు చివరకు మంగళవారం సాయంత్రం ఉరు ములతో కూడిన భారీ వర్షం పడడంతో ప్రజలు ఊరట పొందారు. ఈ వర్షంతో కొంతవరకు పంటల సాగుకు అవకాశం ఉంటుందని రైతులు తెలిపారు. భీమడోలు గ్రామంలో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయ మయ్యాయి. ఉక్కపోతలతో ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలు భారీ వర్షానికి సేద తీరారు. భీమడోలు జంక్షన్‌లో గాలులకు పోలీస్ ఔట్ పోస్టు నేలకూలింది. గురవాయిగూడెం మద్ది ఆంజనేయ స్వామి ఆలయం వద్ద రెండు విద్యుత్ స్థంభాలు పడిపోయాయి.లక్కవరం పంగిడిగూడెం రహదారిలోను, గురవాయిగూడెంలోనూ చెట్లు విరిగిపడ్డాయి. ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో స్థానికులు ట్రాక్టర్లతో వాటిని తొలగించారు.



పెదవేగిలో జోరువాన..



గుర్వాయిగూడెం వద్ద పడిన చెట్లును తొలగిస్తున్న స్థానికులు



కేంద్రమంత్రి నిర్మలను కలసిన కేంద్ర సహాయమంత్రి శ్రీనివాసవర్మ, ఎమ్మెల్యేలు

కేంద్ర మంత్రి నిర్మలను కలసిన ఎమ్మెల్యేలు

తాడేపల్లిగూడెం అర్బన్, జూన్ 18 : ఉమ్మడి పశ్చిమ జిల్లాకు చెందిన కేంద్ర ఉక్కు, గనుల సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మతో పాటు పలు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు మంగళవారం ఢిల్లీలో కేంద్రమంత్రి నిర్మలాసీతా రామన్‌ను మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. తమ నియోజకవర్గాల అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. ఎమ్మెల్యేలు పితాని సత్యనారాయణ, ఆరిమిలి రాధాకృష్ణ, బొలిశెట్టి శ్రీనివాస్, బొమ్మిడి నాయకర్, పత్సమట్ల ధర్మరాజు ఉన్నారు.

రైతుల సమస్యలను పరిష్కరించండి

» జలవనరుల శాఖమంత్రి నిమ్మలకు రైతు సమితి నాయకుల వినతి

భీమవరంటౌన్, జూన్ 18 : రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, కాల్వల పూడికతీత, కాల్వల అభివృద్ధి తక్షణమే చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతు కార్యాచరణ సమితి నాయకులు కోరారు. మంగళవారం పాలకొల్లులో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును కలసి వినతి పత్రం అందించి రైతులు పడుతున్న ఇబ్బందులను వివరించారు. దీనిపై మంత్రి రామానాయుడు స్పందిస్తూ తక్షణమే అవసరమైన చర్యలు తీసుకుంటామని, వచ్చే సీజన్ నాటికి ఎటువంటి సమస్యలు లేకుండా పూర్తిగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం రామానాయుడును సత్కరించారు. కార్యక్రమంలో సమితి గౌరవాధ్యక్షుడు కలిదిండి గోపాలకృష్ణంరాజు, అధ్యక్షుడు పాతపాటి మురళీరామరాజు, కార్యదర్శి తమ్మినీడి నాగేశ్వరరావు, మంతెన కృష్ణంరాజు, నల్లం నాగేశ్వరరావు, భూపతిరాజు సత్యనారాయణరాజు, పీవీ గోపాలకృష్ణంరాజు, ఎంఎస్ఎన్ రాజు, కమలాకరశర్మ, దాట లక్ష్మీపతిరాజు, గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, గోపి శెట్టి మురళీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

20,21న గురుకుల ప్రవేశానికి రాత పరీక్ష

నరసాపురం రూరల్; జూన్ 18: మండలంలోని లక్ష్మణేశ్వరం గ్రామంలోని బీసీ గురుకుల పాఠశాలలో ప్రవేశానికి ఈనెల 20, 21 తేదీల్లో రాత పరీక్షలు నిర్వహిస్తున్నామని జిల్లా కన్వీనర్ శైలజ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు చేరేందుకు మొత్తం 744 దరఖాస్తు వచ్చాయన్నారు. 6, 8 తరగతులకు జూన్ 20న, 21న 7, 9 తరగతులకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. దరఖాస్తు చేసుకున్న వారు హాల్ టిక్కెట్లతో పరీక్షకు హాజరుకావాలన్నారు.

మా నివాసాలను తొలగించొద్దు

» కలెక్టర్‌ను వేడుకున్న పాలకోడేరు పంతొట్టి వాసులు



శ్మశానవాటిక విషయమై ఇరువర్గాల ఘర్షణ దృశ్యం

పాలకోడేరు, జూన్ 18:పాలకోడేరు శివారు పంతొట్టి వద్ద గృహాలను తొలగించి శ్మశానవాటిక ఏర్పాటు చేస్తున్నారని తమకు రక్షణ కల్పించాలని ఆ ప్రాంత వాసులు మంగళవారం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌ను వేడుకున్నారు. పాలకోడేరు శివారు పంతొట్టిలో సుమారు 20 కుటుంబాలు ఇరిగేషన్ పోరంబోకు స్థలంలో పూర్వం నుంచి నివాసం ఉంటున్నారు. వీరి గృహాలను చేర్చి కొంత దూరంలో ఎస్సీ, బీసీలకు చెందిన శ్మశానవాటిక ఉంది. కొంతమంది వ్యక్తులు ఇళ్ళ మధ్యలో నుంచి శ్మశానవాటికకు వెళ్ళేందుకు రహదారిని వేసి గృహాలను చేర్చి మృతదేహాలను పూడుస్తున్నారంటూ కలెక్టర్‌కు తెలిపారు. కలెక్టర్ స్పందించి రెవెన్యూ సిబ్బందికి ఆ వివాదాన్ని పరిష్కరించాలని సూచించడంతో మంగళవారం సాయంత్రం తహసీల్దార్ నాగార్జున, రెవెన్యూ సిబ్బంది వివాదా స్పద స్థలం వద్దకు వచ్చి సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నించారు. ఇరువర్గాలు వాదోపవాదాలు పడడంతో బుధవారం తహసీల్దార్ కార్యాలయానికి రావాలని తెలియపరిచి వెళ్ళిపోయారు. ఈ మేరకు ప్రస్తుతం వివాదం సద్దుమణిగింది. అక్కడ నివాసం ఉంటున్న వారు మాత్రం తమకు ఇబ్బందులు లేకుండా చూడాలని వేడుకుంటున్నారు.

జగన్ చిత్రపటాలు తొలగించండి



ఆర్‌బీకేపై వున్న జగన్ చిత్రం

పాలకోడేరు, జూన్ 18: వైసీపీ ప్రభుత్వం ఓడిపోయి కూటమి ప్రభుత్వం ఏర్పడినా ప్రభుత్వ కార్యాలయా లపై జగన్ చిత్రపటాలు ఇంకా ఉంచడం ఏమిటని టీడీపీ నాయకులు ప్రశ్నిస్తు న్నారు. పాలకోడేరులోని రైతు భరోసా కేంద్రంపై వైఎస్ జగన్ చిత్రపటం ఉండడాన్ని గ్రామ టీడీపీ నాయకులు తప్పుపడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత కూడా ప్రభుత్వ కార్యాలయాలపై జగన్ చిత్రపటాలు ఏమిటని వెంటనే తొలగించాలి అంటున్నారు. పాలకోడేరు ఆర్‌బీకేపై జగన్ చిత్రపటం ఉండడాన్ని వ్యవసాయాధికారి నారాయణరావును వివరణ కోరగా ఆ చిత్రపటాన్ని తీసేందుకు అధికారం లేదని ఆ చిత్రపటం కనిపించకుండా కాగితాన్ని అంటిస్తామని తెలిపారు.

చదువుకునే రోజులు పోయి చదువు"కొనే" రోజులు వచ్చాయి. బడి తలుపులు తీస్తున్న వేళ తల్లిదండ్రుల్లో ఫీజుల టెన్షన్ మొదలైంది. ప్రైవేటు స్కూళ్ళు, కార్పొరేట్ విద్యాసంస్థలలో పుస్తకాలు, ఫీజులు చూస్తుంటే తల్లిదండ్రుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. పిల్లల భవిష్యత్తే తమ భవిష్యత్తుగా భావించి అప్పులు చేసి మరీ పిల్లలను చదివిస్తున్నారు. ఎల్‌కేజీ నుంచే ఫీజుల బాదుడు భారీగా ఉంటుండడంతో తల్లిదండ్రులు ఏం చేయాలో తెలియక సతమతమవుతున్నారు.

- నిడమర్రు

ఫీజుల మోత..



అడ్డదిడ్డంగా ఫీజులు పెంచేస్తూ.. ఇష్టారాజ్యంగా వసూళ్లు చేస్తున్న ప్రైవేటు స్కూళ్లు

» అదనపు దోపిడీకి రూపాలెన్నో
» పుస్తకాలు, యూనిఫాం పేరుతో వసూళ్లు
» తల్లిదండ్రులపై చదువుల భారం



జూన్ నెల వస్తే ..

జూన్ నెల వచ్చిందంటే చాలు..తల్లిదండ్రుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. బడి తలుపులు తెరిచే సమయానికి పిల్లలు చదువు కోసం వేలల్లో, లక్షల్లో సొమ్ములు చూసుకోవాల్సి పరిస్థితి దాపురించింది. తాడేపల్లిగూడెంకు చెందిన ఓ కార్పొరేట్ స్కూల్‌లో పదో తరగతి విద్యార్థికి హాస్టల్‌తో కలిపి లక్ష రూపాయలు చెల్లించాలని మెస్సేజ్ రావడంతో పేరెంట్స్ బెంబేలెత్తిపోతున్నారు. కనీసం ఫీజులు వాయిదా రూపంలో చెల్లించడానికి కూడా ససేమిరా అంటుంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఒక పేరున్న ప్రైవేట్ స్కూల్‌లో చదివించాలంటే ఆరు నుంచి పదో తరగతి వరకు తరగతిని బట్టి ఒక్కో విద్యార్థికి రూ.50 వేల నుంచి 80 వేల వరకు ఫీజుల రూపంలో అవుతుంది. దీనికి ట్రాన్స్‌పోర్టు ఫీజు అదనం.

అడ్డదిడ్డంగా ఫీజులు

గత సంవత్సరం 4వ తరగతి చదివే పిల్లవాడికి ఓ కార్పొరేట్ స్కూల్‌లో బుక్స్ ఫీజు రూ.4 వేలు అయితే నేడు అదే పిల్లవాడికి 5వ తరగతి బుక్స్ ఫీజు రూ.10 వేలు వేయడంతో పేరెంట్స్ గగ్గోలు పెడుతున్నారు. ఐదో తరగతి పిల్లవాడికి అంత ఖరీదైన బుక్స్ ఏముంటాయని ప్రశ్నిస్తున్నారు. ప్రతి సంవత్సరం ఇలా ఫీజులు ఇష్టారాజ్యంగా పెంచుకొంటూ పోతే ఎలా చదివించు కోవాలని ఓ మధ్య తరగతి కుటుంబం ఆవేదన చెందుతోంది. రోజురోజుకూ పెరుగుతున్న చదువుల భారం తగ్గించేందుకు గత ప్రభుత్వం కొంత ప్రయత్నం చేసి పేరెంట్స్ కమిటీ సభ్యులతో చర్చించి ఆరోగ్యకరమైన, హర్షనీయమైన ఫీజుల విధానం ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రయత్నిస్తే సఫలం కాలేదు. ప్రైవేటు స్కూల్స్ యజమాన్యాలు ప్రభుత్వ చర్యలు అమలు చేయనీయలేదు. పేరెంట్స్ కూడా ప్రైవేటు స్కూల్స్ మాయలో పడిపోతున్నారు. ఇంగ్లీషు మీడియం పేరుతో సరైన విద్యార్హతలు లేని ట్యూటర్లతో బోధన చేస్తున్నప్పటికీ అక్కడ ఏదో చేప్పేస్తారు అనే అపోహతో అధిక ఫీజులు చెల్లించి మరీ ప్రైవేటు, కార్పొరేట్ స్కూల్స్‌లో చేర్పించి అప్పులు పాలవుతున్నారు. కొత్త ప్రభుత్వం హయాంలోనైనా ఫీజుల భారం తగ్గుతుందని పేరెంట్స్ ఆశతో ఎదురుచూస్తున్నారు.

దారుణంగా పెంచేస్తున్నారు



నా ఇద్దరు పిల్లల చదువు కోసం ప్రతి సంవత్సరం లక్షల్లో ఖర్చువుతోంది. పిల్లలకు చదువును మించిన ఆస్తి ఇంకొకటి లేదని భావించి గణపవరం సమీపంలో కార్పొరేట్ స్కూల్‌లో జాయిన్ చేశాను. స్కూల్ ఫీజులు ప్రతి ఏటా దారుణంగా పెంచేస్తున్నారు. గత సంవత్సరానికి ఈ ఏడాదికి బుక్స్ ఫీజు డబుల్ చేశారు. కొత్త ప్రభుత్వం పత్యేక శ్రద్ధ తీసుకొని తక్కువ ఫీజుతో నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలి.

- తెలగారెడ్డి వెంకట సతీష్, పేరెంట్, గణపవరం

అధికంగా వసూలు చేస్తే ఫోన్ చేయండి



అధిక ఫీజులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.ప్రైవేటు స్కూల్స్ యాజమాన్యాలతో ఎప్పటికప్పుడు చర్చలు జరిపి అందరికీ ఆమోద యోగ్యమైన ఫీజులు నిర్ణయించాలని సూచనలు చేస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా ఎక్కడైనా అధిక ఫీజులు వసూలు చేస్తున్నట్టయితే నా సెల్ నెంబర్ 98499 09105కు ఫిర్యాదు చేయండి. తక్షణం చర్యలు తీసుకుంటా..

ఎస్.అబ్రహం, డీఈవో, ఏలూరు జిల్లా

టేకు చెక్కపై 'రామాయణం'

» అబ్బురపరుస్తున్న కనకలింగ వీరబ్రహ్మం చెక్కిన చిత్రాలు
» తలుపులపై దేవుడి బొమ్మలు, సిమెంట్ దిమ్మెలపై శిల్పాలు







↑ డిజైన్ చేసుకుంటున్న చిత్రం

చెక్కపై రామాయణం ఇతివృత్తం.. మందగుల కనకలింగ వీరబ్రహ్మం

చింతలపూడి, జూన్ 18 : ఆధునిక యుగంలో యంత్రాలు.. టెక్నాలజీ వచ్చినా చేతివృత్తుల కళలు అంతరించిపోకూడదు. కళలు, కళాకారులు, శిల్పులు తమ నైపుణ్యం చాటిన చోట రాజ్యాలు కళకళలాడేవని చెబుతుంటారు. అంతటి అద్భుతమైన రామయణ ఇతివృత్త చిత్రాలను టేకు చెక్కపై చెక్కిన కనకలింగ వీరబ్రహ్మం తన కళానైపుణ్యంతో అబ్బురపరిచారు. ఏలూరు జిల్లా చింతలపూడికి చెందిన మందగుల కనకలింగ వీరబ్రహ్మం ఎలక్ట్రీషియన్‌గా పదేళ్ళు పనిచేసి 2001లో పాత యర్రవరపు శేషయ్య స్ఫూర్తితో తలుపులపై దేవుడి బొమ్మలు చెక్కడం, సిమెంట్ దిమ్మెలపై శిల్పాలు చెక్కడంలో ఆరితేరారు. ఇప్పుడు కొత్తగా రామాయణ ఇతివృత్తం గల పాత్రలు, వాటి విశిష్టతలను తెలుపుతూ రెండు అడుగుల మందం గల టేకుచెక్కపై 20 అంగుళాల వెడల్పు, 30 అంగుళాల ఎత్తుగల చెక్కపై మూడు నెలల సమయంలో రామాయణ ఇతివృత్తం చెక్కారు.

గతంలో పురస్కారాలు

వీరబ్రహ్మం గతంలో పలు పురస్కారాలు అందుకున్నారు. 2015-16లో శిల్పిగా ఉగాది పురస్కారం, 2024 ఢిల్లీకి చెందిన విశ్వకర్మ కమ్యూనిటీ నుంచి లెజెండ్ అవార్డు పొందటం, ఇప్పుడు ఈ కళాఖండాన్ని కేంద్రశాఖకు అవార్డు నిమిత్తం పంపించానని తెలిపారు.

తాత శేషయ్యే స్ఫూర్తి

తనకు తన తాత యర్రవరపు శేషయ్యే ఈ కళాఖండంలో నైపుణ్యం రావడానికి కారణమని వీరబ్రహ్మం తెలిపారు. తన తాత 1936లో రైలు ఇంజన్ చెక్కిన బొమ్మ తయారు చేశారు. బ్రిటీష్ ప్రభుత్వం అప్పుడు అతడికి గోల్డ్‌మెడల్ అందజేసిందని ఆయన పంచలోహ విగ్రహాలు తయారు చేయడం, నగశీలు పెట్టడం వంటివి చేసేవారని తెలిపారు. ఆయన స్ఫూర్తి తనకు ఇప్పుడు ఈ విధమైన శిల్పకళకు ఉపయోగపడిందని చెప్తున్నారు. హస్త కళలు అంతరించి పోకుండా ఉండేందుకు ఉత్సాహ యువకులు ముందుకు వస్తే శిక్షణ ఇవ్వడానికి సిద్ధమని ఇటువంటి కళలు అంతరించిపోకూడదని పేర్కొన్నారు. వివరాలకు 94908 83646 నంబరుకు సంప్రదించవచ్చని తెలిపారు.

నిడమర్రు నుంచి ఫత్తేపురం రోడ్డుకు జనసేన నేత సొంత నిధులతో మరమ్మతులు



రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న వాసు

నిడమర్రు జూన్ 18 :తమ గ్రామానికి వెళ్లే రహదారికి తానే సొంతంగా మరమ్మతులు చేయించి అందరికీ ఆదర్శంగా నిలిచాడు ఓ యువకుడు. నిడమర్రు నుంచి ఫత్తేపురం వరకు సుమారు ఆరు కిలోమీటర్ల రహదారి పెద్ద గోతులతో అధ్వానంగా తయారైంది. గత ప్రభుత్వ హయాంలో అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకొన్నా స్పందన లేదు. ఇటీవల కూట మి ప్రభుత్వం అధికారం చేపట్టడంతో శాశ్వత రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యేలోపు ప్రభుత్వానికి అండగా పెదనింద్రకొలనుకు చెందిన జనసేన నాయకుడు పత్సాకుల వాసు స్పందించి సుమారు రూ.లక్ష అంచనాతో ఎక్స్‌కవేటర్ సాయంతో కంకరతో గోతులను పూడ్చడానికి ముందుకు వచ్చారు. సొంత నిధులతో మరమ్మతులు చేయడం పట్ల గ్రామస్థులు, పలువురు అభినందించారు.

ఉపాధి కూలీకి పాము కాటు

» తణుకు ఏరియా ఆసుపత్రిలో చికిత్స.. నిలకడగా పరిస్థితి



సిద్ధాంతం పీహెచ్‌సీలో బాధితురాలిని పరామర్శిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్ దొర

పెనుగొండ, జూన్ 18 : పెనుగొండ మండలం దేవ గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న గుడాల లలిత అనే మహిళను విషపూరితమైన పాము కాటేసింది. స్థానికులు తెలిపిన వివరాలివి.. దేవ గ్రామ శివారు పెళ్ళికూతురమ్మ చెరువు వద్ద మంగళవారం పంట కాల్వలో సుమారు 40 మంది ఉపాధి పనులు చేస్తున్నారన్నారు. పని ముగించుకునే క్రమంలో లలితను తాచుపాము కాటు వేసిందన్నారు. సత్వరమే సిద్ధాంతం ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తీసుకురావడంతో ఆమెకు ప్రథమ చికిత్స చేశారు. ఎంపీడీవో ఎస్. శ్రీనివాస దొర, సాంకేతిక నిపుణుడు శంకర్ వచ్చి ఆమెను పరామర్శించారు. లలితను మెరుగైన చికిత్స కోసం పెనుగొండ సీహెచ్‌సీకి తరలించగా అక్కడ నుంచి తణుకు ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు బంధువులు తెలిపారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు.

మోటారుసైకిల్ దొంగతనంపై కేసు

పెదపాడు, జూన్ 18 : పెదపాడు మండలం కలపర్రు టోల్‌గేట్ పరిసరాల్లో రోడ్డు పక్కన నిలిపి వుంచిన బుల్లెట్ బైక్‌ను గుర్తుతెలియని వ్యక్తి దొంగిలించాడని ఓ వ్యక్తి ఫిర్యాదు చేసిన ఘటన మంగళవారం జరిగింది. వివరాలివి.. కలపర్రు టోల్ గేట్ పరిసరాల్లో రోడ్డు పక్కన నిలిపి వుంచిన బుల్లెట్ బైక్‌ను గుర్తుతెలియని వ్యక్తి దొంగిలించాడని దెందులూరు మండలం సోమవరప్పాడుకు చెందిన వెంకన్నబాబు ఫిర్యాదు చేశారు. మరమ్మతులకు గురై టోల్‌గేట్ సమీపంలో బైక్ ఆగిపోవడంతో రోడ్డు పక్కన నిలుపుదల చేసి వెళ్లగా బుల్లెట్ దొంగిలించారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పెదపాడు ఎస్ఐ కె.శుభశేఖర్ తెలిపారు.

రూ.ఐదు లక్షల సొమ్ము మాయం

» భీమవరం పట్టణంలో బైక్ డిక్కీలో పెట్టిన నగదు చోరీ

భీమవరంక్రైం, జూన్ 18 : భీమవరం పట్టణంలోని ఓ బ్యాంకు వద్ద ద్విచక్ర వాహనాన్ని పార్కు చేసి తిరిగి వచ్చేసరికి అందులో ఉంచిన ఐదు లక్షల రూపాయలను గుర్తుతెలియని దుండగులు చోరీ చేశారు. ఈ ఘటన భీమవరం ఒకటో పట్టణంలోని బుధవారం మార్కెట్లో మంగళవారం జరిగింది. పెనుమంట్ర మండలం మార్టేరు గ్రామానికి చెందిన చెర్ల రవిశంకర్‌రెడ్డి తన ద్విచక్ర వాహనంపై మంగళవారం భీమవరం వచ్చారు. తనతో తెచ్చుకున్న ఐదు లక్షల రూపాయలను వాహనం డిక్కీలో ఉంచి బ్యాంకుకు వెళ్లారు. తిరిగి వచ్చేసరికి డిక్కీ తెరిచి ఉండడం అనుమానం వచ్చింది.. తీసి చూస్తే ఐదు లక్షల రూపాయలు కనిపించలేదు. దీనిపై వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

ఆగని వైసీపీ మూకల దాడులు

దివ్యాంగ టీడీపీ నాయకుడిపై సర్పంచ్ దాడి

» భీమడోలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న అశోక్



టీడీపీ మండల కార్యదర్శిపై దాడి చేస్తున్న వైసీపీ శ్రేణులు

ద్వారకాతిరుమల, జూన్ 18: వైసీపీ అరాచకాలు, దౌర్జన్యాలు కొనసాగుతూనే ఉన్నాయి. దివ్యాంగుడైన టీడీపీ మండల కార్యదర్శిపై పాతకక్షల నేపథ్యంలో గ్రామ వైసీపీ సానుకూల సర్పంచ్, అతడి అనుచరులు మంగళవారం విచక్షణారహితంగా దాడి చేసిన ఘటన పంగిడిగూడెంలో జరిగింది. స్థానికులు, బాధితుడు తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన కాలి అశోక్ శారీరకంగా అంగవైకల్యంతో బాధపడుతున్నాడు. టీడీపీపై ఉన్న అభిమానంతో చురుగ్గా పనిచేయడంవల్ల పార్టీ మండల కార్యదర్శిని చేశారు. 2021 పంచాయతీ ఎన్నికల్లో అతడు గ్రామానికి చెందిన వైసీపీ నేత పత్తిపాటి మహాలక్ష్ముడు అనే యోహానుపై పోటీ చేసి ఓడిపోయాడు. అయినా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూ ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో గ్రామంలో టీడీపీకి మంచి మెజారిటీ వచ్చేందుకు కృషి చేశాడు. టీడీపీ విజయానికి కృషి చేయడం, సర్పంచ్‌గా పోటీచేయడాన్ని ఓర్వలేక మంగళవారం పార్టీ కార్యాలయంలో వున్న అశోక్‌ను బయటకు పిలిపించి అతడి అంగవైకల్యాన్ని హేళన చేస్తూ.. దుర్భాషలాడి తన అనుచరులైన గుమ్మడి శ్రీను, గుమ్మడి బుచ్చియ్య, గుమ్మడి దేవయ్యతో కలసి దాడి చేశాడు. దివ్యాంగుడు కావడంతో ఆ మూకను ఎదుర్కోలేక దాడిలో తీవ్రంగా గాయపడిన అశోక్‌ను భీమడోలు ప్రభుత్వ ఆసుపత్రికి స్థానికులు తరలించి చికిత్స అందిస్తున్నారు.

శృంగవృక్షంలో ఫ్లెక్సీల వివాదం



శృంగవృక్షంలో గుర్తుతెలియని వ్యక్తులు చించిన జనసేన ఫ్లెక్సీలు

పాలకోడేరు, జూన్ 18 : శృంగవృక్షం గ్రామంలో జనసేన నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చించివేయడంతో జనసేన నాయకులు పాలకోడేరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో రహదారిని చేర్చి, మరికొన్ని పలు ప్రాంతాల్లో జనసేన నాయకులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఆ ఫ్లెక్సీల్లో చంద్రబాబు, పవన్‌కల్యాణ్, ఉండి నియోజకవర్గ ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు, స్థానిక నాయకులతో కూడిన ఫెక్సీ ఏర్పాటు చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు చించివేయడంతో జనసేన నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఉండి ఎమ్మెల్యే రఘురామకు, పాలకోడేరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

బ్యానర్‌ను చించారంటూ పోలీసులకు ఫిర్యాదు

ఉండి, జూన్ 18: ఓ బ్యానర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు చించారని.. తన తండ్రిపై గొడవకు వచ్చిన ఇరువురిపై అనుమానం ఉందని రంపా అశోక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మంగళవారం ఉండి పోలీసులు తెలిపిన వివరాలివి.. చినపుల్లేరు శివారు తల్లమ్మచెరువుకు చెందిన రంపా అశోక్ తండ్రి పౌలురాజుతో అదే గ్రామానికి చెందిన ఇరువురు నక్కా సంతోష్, మద్దా దీపక్ అనేవారు ఈనెల 2వ తేదీన వచ్చి పాత గొడవ పురస్కరించుకుని ఘర్షణ పడ్డారు. ఈనెల 12వ తేదీన అశోక్ తండ్రి గ్రామంలో కూటమి గెలిచిందని ఫ్లెక్సీ బ్యానర్ కట్టుకున్నారు. దానిని గుర్తుతెలియని వారు చింపివేశారు. గతంలో ఘర్షణకు దిగిన వారే చింపిన వారిపైనే అనుమానం ఉందని పోలీసులకు అశోక్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్ననమని ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు.

క్రైం సమాచారం

విద్యుదాఘాతంతో కూలీ మృతి

చింతలపూడి, జూన్ 18:చింతలపూడి మండలం గణిజర్ల గ్రామంలో విద్యుదాఘాతంతో మద్దెల సురేష్ (35)అనే కూలీ మృతి చెందాడు. గ్రామంలోని ఒక తోటలో పనికి వెళ్లి విద్యుత్ స్తంభం లేపుతుండగా ఆ స్తంభంపై వున్న విద్యుత్‌తీగలు తగిలి వున్నాయి. అవి చూసుకోకుండా స్తంభాన్ని పట్టుకోవడం వల్ల విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అతడికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. పనికివెళ్ళి విద్యుదాఘాతానికి గురికావడంతో ఆ కుటుంబం కన్నీరుమున్నీరైంది.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి

ఏలూరు క్రైం, జూన్ 18 : వేగంగా వెళ్తున్న రైలు నుంచి బిహార్ వాసి ప్రమాదవశాత్తు జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. బిహార్‌కు చెందిన సుజన్‌మహల్దార్(24) బిహార్ నుంచి విజయవాడ వెళ్తున్న రైలులో మంగళవారం సాయంత్రం భీమడోలు మండలం పాతూరు రైల్వే గేటు సమీపంలో ప్రమాదవశాత్తు రైలు బోగీ నుంచి జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సమాచారం ఏలూరు రైల్వే ఎస్ఐ డి.నరసింహారావుకు అందడంతో మంగళవారం రాత్రి ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడి వద్ద లభించిన ఆధారాలతో కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వా సుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చేతబడి నెపంతో పూజారిపై కత్తితో దాడి

పోలవరం, జూన్ 18 : చేతబడి చేస్తున్నాడనే నెపంతో గుడి పూజారిపై ఓ వ్యక్తి తాటాకు నరికే కత్తితో దాడి చేసి విచక్షణా రహితంగా నరికిన ఘటన పోలవరం మండలం ఎల్ఎన్‌డీపేట గ్రామంలో మంగళవారం ఉదయం జరిగింది. పోలవరం ఎస్ఐ ఎస్.పవన్‌కుమార్ తెలిపిన వివరాలివి.. ఎల్ఎన్‌డీపేట గ్రామంలోని కనకదుర్గమ్మ ఆలయ పూజారిగా పనిచేస్తున్న జొన్నాడ పేరాస్వామి చేతబడి చేస్తున్నాడనే నెపంతో గ్రామానికి చెందిన చిక్కాల యేసు కత్తితో పొట్ట, వీపుపై విచక్షణారహితంగా దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన పూజారిని ప్రభుత్వ సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రానికి అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం రాజమహేంద్రవరం తరలించారు. పూజారి భార్య ఎం.లక్ష్మి మాట్లాడుతూ గ్రామంలో తన భర్త పూజారి చేతబడి చేస్తున్నాడని దుష్ప్రచారం చేస్తున్నాడని, అదేమిటని అడిగినందుకు కత్తితో దాడికి పాల్పడినట్టు తెలిపింది. ఈ మేరకు ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

కొట్లాటపై కేసు నమోదు

పెదపాడు, జూన్ 18 : సరిహద్దు తగాదా నేపథ్యంలో తనను కొట్టి గాయపర్చారంటూ వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ కె.శుభశేఖర్ తెలిపారు. పెదపాడు మండలం గోగుంట గ్రామానికి చెందిన కుందేటి కిరీటం ఏలూరు ఆవుట్‌పోస్టు పోలీసుకు ఇచ్చిన ఫిర్యాదుతో, వారి సమాచారం మేరకు తానంకి మల్లేశ్వరరావు, రాజేష్‌లపై పెదపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

కమ్మేసిన పొగ

స్థానికులు, ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు

డంపింగ్ యార్డు సమస్య పరిష్కరించాలని స్థానికుల విజ్ఞప్తి



ఆకివీడులో చెత్తకు నిప్పు అంటించడంతో కమ్ముకున్న పొగ

ఆకివీడు, జూన్ 18: అనధికార డంపింగ్ యార్డులో చెత్తను అంటించడంతో కమ్ముకుంటున్న పొగతో స్థానికులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆకివీడు మేజర్ పంచాయతీని నగర పంచాయతీగా గత ప్రభుత్వం చేసింది తప్ప అభివృద్ధి శూన్యం. నేటికీ పూర్తిస్థాయిలో అధికారులను నియమించకపోవడంతో నగర పంచాయతీలో ఇద్దరు అధికారులతోనే పాలన కొనసాగుతుంది. సిద్ధాపురం వైపు వెళ్లే వంతెన దగ్గరలో ఉన్న అనధికార డంపింగ్‌యార్డుకు స్థలం లేకపోవడంతో వేసిన ఎప్పటికప్పుడు తరచూ చెత్తను అంటిస్తున్నారు. అంటించిన సమయంలో వచ్చే పొగతో ఆ ప్రాంతం మీదుగా ధర్మాపురం, సిద్ధాపురం, కళింగగూడెం, రాజులపేట తదితర గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులతో పాటు, వ్యాధుల బారిన పడుతున్నారని టీడీపీ రాష్ట్ర రైతు నాయకుడు భూపతిరాజు తిమ్మరాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించాలని పాలకులు, అధికారులను కోరుతున్నారు.

రేపు కేఆర్ పురంలో జాబ్ మేళా

ఏలూరు కలెక్టరేట్, జూన్ 18: ఐటీడీఏ కోటరామచంద్రాపురంలో గురువారం వైటీసీ సమావేశ మందిరంలో నిరుద్యోగ యువతీ యువకులకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి సి.మధుభూషణ్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్ మేళాకు తిరుపతి జిల్లాలోని శ్రీసిటీలో ఉన్న బాండ్‌లేజ్ ఇండియా ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, కాట్‌బరీ చాక్లెట్ తయారీ కంపెనీ ప్రతినిధులు హాజరు కానున్నారని తెలిపారు. ఈ కంపెనీలో టీమ్ సభ్యులు, ట్రైనీగా పని చేయుటకు ఇంటర్మీడియట్‌లో 50 శాతం మార్కులు సాధించిన 18 నుంచి 21 ఏళ్ళ వయస్సు గల యువతీ యువకులు అర్హులన్నారు. రూ.15 వేలు జీతం ఇస్తారన్నారు. అలాగే అపోలో టైర్స్ కంపెనీలో డిగ్రీ, డిప్లమా, బీటెక్‌లో ఉత్తీర్ణత సాధించిన యువతకు రూ.16 వేలు జీతం, ఇతర సదుపాయాలు కల్పించబడు న్నారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబర్ 88868 82032లో సంప్రదించాలన్నారు.

ఆలయ భూముల లీజు వేలం

పెదపాడు, జూన్ 18 : గ్రామంలోని సోమేశ్వరస్వామి ఆలయం, జాస్తి సుబ్బయ్య చౌల్ట్రీ, గారపాటి రామచంద్రయ్య చారిటీస్, వేణుగోపాలస్వామి ఆలయా నికి సంబంధించిన భూములు మూడేళ్ళ కాలపరిమితి లీజునకు సంబంధించి వేలం మంగళవారం నిర్వహించినట్లు కార్యనిర్వహణాధికారి ప్రకృతాంబ తెలిపారు. పెదపాడులోని సర్వే నెం. 398, 455, 456, 1199లల్లోని 6.28 ఎకరాలు, సర్వే నెం. 127/1, 161, 35లలోని 9.36 ఎకరాలు, సర్వే నెం. 11.24, 50/1లో 8.23 ఎకరాలు, సర్వే నెం. 1120, 1135, 444, 451, 1229/1ల్లోని 7.03 ఎకరాల వ్యవసాయ, చేపల చెరువులను బహిరంగ వేలంలో హెచ్చు పాటదారులకు అందజేయడం జరిగిందన్నారు. వేలం పరిశీలనాధికారిగా అప్పనవీడు అభయాం జేయస్వామి ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాస్ వ్యవహరించారు.

ఎంపీడీవోపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

పోలవరం, జూన్ 18 : విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్న పోలవరం మండల ప్రజాపరిషత్ అధికారి జి.శ్రీనుపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి గుడెల్లి వెంకట్రావు డిమాండ్ చేశారు. పోలవరంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎంపీడీవో ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండడం లేదని ఆరోపించారు. మండలం అభివృద్ధిపై దృష్టి సారించడం లేదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంపై శ్రద్ధ లేని ఎంపీడీవోపై చర్యలు తీసుకోవాలన్నారు. సభ్యులు మాట్లాడుతూ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ప్రాతిపదికన పని చేస్తున్న సిబ్బందితో అనుచితంగా ప్రవర్తిస్తున్నారన్నారు. కింద స్థాయి సిబ్బందితోనూ, కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్న ఒక దివ్యాంగుడిని చులకనగా చూస్తూ. వేధించినట్లు తమ దృష్టికి వచ్చిందని ఈ విషయంపై కూడా అధికారులు విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు.

మెయిన్ రోడ్డు ఆక్రమణలు తొలగించండి

లింగపాలెం, జూన్ 18: ఆర్టీసీ బస్టాండ్‌ను పలువురు ఆక్రమించటం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రయాణికులు బయట రోడ్డుపై నిలబడాల్సి రావడంతో ట్రాఫిక్ జామ్ అయ్యి ప్రయా ణికులు ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని, బీజేపీ మండల అధ్యక్షుడు కుర్రా సుబ్రహ్మణ్యేశ్వరవరప్రసాద్ అన్నారు. ధర్మాజిగూడెంలో ఆర్టీసీ బస్టాండ్‌ను పలువురు ఆక్రమించి షాపులు నిర్మించి అద్దెలకు ఇస్తున్నారని, బస్టాండు స్థలంలో ఖాళీ లేకపోవడంతో ప్రయాణికులు, విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, వారు రోడ్డు పై నిలబడాల్సి రావడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. గత ప్రభుత్వంలో ఏలూరులో స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన సొంగా రోషన్‌కుమార్‌కు వినతిపత్రం అందించి బస్టాండు ఆవరణలోని ఆక్రమణలను తొలగించాలని ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు.

బాలబాలికలకు చట్టాల పై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి మధుబాబు

చింతలపూడి, జూన్ 18: విద్యార్థులు, బాలబాలికల్లో చట్టాల పై అవగాహన ఉండాలని, స్థానిక జూని యర్ సివిల్ జడ్జి సిమధు బాబు అన్నారు. అంత ర్జాతీయ బాలకార్మిక నిరోధక దినోత్సవం సంద ర్భంగా స్థానిక ఆంథోని నగర్‌లోని ఎంపీపీ పాఠశాల లో మండల న్యాయసేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సులో ఆయన మాట్లాడుతూ బాలికలు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. వెట్టిచాకిరి నుంచి విముక్తి పొందాల న్నారు. చట్టాలు వీరి రక్షణకు ఉన్నాయని, ఆ చట్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు బి.నాగేశ్వరరావు, ఫరూక్, డేవిడ్‌రాజు, దుర్గాభవానీ, ఎమ్డీ అక్బర్‌ఆలీ పాల్గొన్నారు.

దివ్యాంగ నిర్ధారణ వైద్య శిబిరం

బుట్టాయగూడెం, జూన్ 18 : స్థానిక జెడ్పీ హైస్కూల్లో సమగ్ర శిశు సంరక్షణ ఏలూరు వారి ఆధ్వర్యంలో ఉపకరణాల పంపిణీ కోసం మంగళవారం దివ్యాంగ నిర్ధారణ వైద్య శిబిరం నిర్వహిం చారు. పోలవరం నియోజక వర్గంలోని ఏడు మండలాల్లో ఉన్న ప్రత్యేక అవసరాలు కలిగిన ఒకటి నుంచి 18 సంవత్సరాలు నిండిన బాలబాలికలు, తల్లిదండ్రు లు వైద్య శిబిరంలో పాల్గొనగా వైద్యాధికారులు నిర్ధారణ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న అడిషనల్ ప్రాజెక్టు ఆఫీసర్ బి.సోమశేఖర్, ఐఈ కో ఆర్డినేటర్ బి.భాస్కరరావు, విద్యాశాఖాధికారులు, ఐఈఆర్‌టీలు పాల్గొన్నారు.

చిన్నపని కూడా చేయించలేక పోయా

జంగారెడ్డిగూడెం, జూన్ 18 : తన వార్డులో మూడేళ్లుగా చిన్న పని కూడా చేయక పోవడంతో వార్డులో తలెత్తుకుని తిరగలేకపోతున్నానని 21వ వార్డు కౌన్సిలర్ కంచర్ల గీతా కుమారి ఆవేదన వ్యక్తం చేశారు. జంగారెడ్డిగూడెం మున్సిప ల్ సాధారణ సమావేశం మంగళవారం చైర్ పర్సన్ బత్తిన నాగలక్ష్మి అధ్యక్షతన జరిగింది. మున్సిపల్ కమిషనర్ నరేంద్రకుమార్ మాట్లాడుతూ రోడ్డు మంజూరైనా కాంట్రాక్టర్ వేయడానికి ముందుకు రావడంలేదని బ్లాక్ లిస్టులో పెడతామన్నారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు(అంజి) పట్టణంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ కంచర్ల వాసవీ రత్నం, కౌన్సిలర్లు వలవల తాతాజీ, పీపీఎన్ చంద్రరావు, కాసర తులసీ రెడ్డి అయినాల రమణ మూర్తి, తదితరులు నూతన ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలియజేశారు.

నేడు హనుమాన్ శోభాయాత్ర

జంగారెడ్డిగూడెం, జూన్18 : ఛత్రపతి శివాజీ మహారాజ్ పట్టాభిషేక మహోత్స వం సందర్భంగా బుధవారం సాయంత్రం 3.30 గంటలకు గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయం నుంచి జంగారెడ్డిగూడెం పట్టణంలోని ఇందిరానగర్ కాలనీ వద్ద ఉన్న అభయాంజనేయస్వామి ఆలయం వరకు ద్విచక్ర వాహన ర్యాలీ జరుగుతుందని నిర్వాహకులు తిప్పాబొట్ల రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తగా ఆర్ఎస్ఎస్ నుంచి ఓలేటి సత్యనారాయణ, ముఖ్యఅతిథిగా బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయులు (తపన చౌదరి) పాల్గొంటారని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సంక్షిప్త సమాచారం..

- **పెదపాడు :** అప్పనవీడులోని ప్రసిద్ధి చెందిన అభయాంజనేయస్వామి ఆలయం వద్ద మంగళవారం భక్తుల సహకారంతో అన్న సమారాధన నిర్వహించారు.
- **ఏలూరు కార్పొరేషన్ :** నగరంలోని పలు డివిజన్లలో గల ఆంజనేయస్వామి ఆలయాల వద్ద మంగళవారం భక్తులు తమలపాకులు, సింధూరంతో అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. హనుమాన్ చాలీసా పారాయణ చేశారు.
- **జీలుగుమిల్లి :** రాచన్నగూడెంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను అధికా రులు పర్యవేక్షించాలని ఎంపీటీసీ పూసం అర్జునరావు, టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షులు పులుమోలు శివాజీ, తదితరులు ఎంపీడీవో, ఉపాధి ఏపీవోను మంగళవారం కలిసి విజ్ఞప్తి చేశారు.
- **ఏలూరు రూరల్:** రాష్ట్రీయ లోక్‌జన్ శక్తి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వెస్లీ పుట్టిన రోజు సందర్భంగా స్థానిక రామకృష్ణాపురం ఫ్లైవోవర్ బ్రిడ్జి క్రింద నివసించే పేదలు, యాచకులకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు.
- బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం నూర్‌భాష దూదేకుల ముస్లీమ్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ సయ్యద్‌బాజి తెలుగులో ప్రచురించిన ఖురాన్ గ్రంథాన్ని పలువురికి పంపిణీ చేశారు.
- **ఉంగుటూరు :** రైల్వే గేటు అవతల ఉన్న ఇరిగేషన్ బోదెలో చుట్టుపక్కల ఉన్న పరిశ్రమలలోని వ్యర్థాలను వదులుతుండడంతో గ్రామ సర్పంచ్ బండారు సింధు, కార్యదర్శి కాకర్ల గిరిధర్ మంగళవారం ఎపరిశ్రమలకు నోటీసులు ఇచ్చి వారం రోజులలో రైతులకు ఉపయుక్తంగా ఉండేలా బోదెను తవ్వాలని సూచించారు.
- వలంటీర్లు తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షుడు పాతూరి విజయకుమార్‌ను మంగళవారం కలిసి వైసీపీ నాయకుల వత్తిడి మేరకు రాజీనామా చేశామని ఇంటర్, డిగ్రీ చదువుకున్న తమకు ఉపాధి కల్పించాలని వినతి పత్రం ఇచ్చారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

'నేను బడికి పోతా' ర్యాలీలలో అధికారులు


బోడిగూడెం బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఐసీడీఎస్ విద్యార్థులు

లింగపాలెం, జూన్ 18: ప్రభుత్వ పాఠశాలలలో నాణ్యమైన విద్య లభిస్తుందని ఉపాధ్యాయులు అన్నారు. కొత్తపల్లి జిల్లా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు జేవీఆర్ ఆధ్వర్యం లో నేనే బడికి పోతా కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఉంటారని, విద్యార్థులకు నాణ్యమైన, మెరుగైన విద్యను అందిస్తారని ఆయన అన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- కామవరపుకోట : ప్రభుత్వ పాఠశాలలను విద్యార్థుల తల్లిదండ్రులు, సంరక్షకులు ప్రోత్సహిం చాలని మండల విద్యాశాఖాధికారి డి.సుబ్బారావు పిలుపునిచ్చారు. కొత్తూరులో అధ్యాపకులు బడికిపోదాం ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ ఫీజు ఉండదని, రెండు యూనిఫాంలు, టెక్ట్స్ బుక్స్, నోట్ బుక్స్ ఉచితంగా ఇస్తారన్నారు. పోషక విలువలు కలిగిన ఆహారం ఇస్తారని, స్టడీ క్లాసులు ఉంటాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకోవడం వలన ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థులకు ఆరోగ్యం కోసం ఆటలను కూడా ఆడిస్తామని చెప్పారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- ఉంగుటూరు : మండలం ఉప్పాకపాడులో నేనూ బడికి పోతా ర్యాలీ నిర్వహించారు. ప్రధానోపా ధ్యాయుడు నక్కా సుధాకర్ ఆధ్వర్యంలో బడి ఈడు పిల్లలు బడిలో చేరాలని నినాదాలు చేశారు. ఎంపీటీసీ ఇంటి మంగరాజు, గ్రామ పెద్దలు వెంకటే శ్వరరావు, దాసరి శ్రీను, మంచాల పెద సత్యనారా యణ, దాసరి వీర్రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- కొయ్యలగూడెం, : తల్లిదండ్రులంతా తమ తమ పిల్లలను బడికి పంపించాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిని స్వర్ణకుమారి కోరారు. బోడిగూడెంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపర్‌వైజర్ నయామరాణి, తదితరులు పాల్గొన్నారు.
- పెదపాడు : నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించి విద్యార్థులు బడికి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్లుగా ఎంఈవో - 2 దేవినేని వెంకటరమణ తెలిపారు. పెదపాడు మండలం కలపర్రులో హెచ్ఎం వై.శరత్‌బాబుతో కలిసి విద్యార్థుల ఇళ్లకు వెళ్లి పాఠశాల, చదువు ఆవశ్యకతను వివరించారు. పాఠశాలకు తప్పకుండా వచ్చేలా అవగాహన కల్పించారు. పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.
- టి.నరసాపురం : బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని మక్కినవారిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్. వెంకటేశ్వరరావు తెలిపారు. గ్రామంలో నేనుబడికి పోతా ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో అన్ని సదుపాయాలు ఉంటాయన్నారు. ఉపాధ్యాయు లు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించండి


చింతమనేనిని అభినందిస్తున్న జయప్రకాష్

పెదవేగి, జూన్ 18 : సాంఘిక సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు మెరుగైన వసతులు, సౌకర్యాలు కల్పించాలని సాంఘిక సంక్షేమ శాఖ సంయుక్త సంచాలకుడు (జేడీ) జయప్రకాష్‌కు దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సూచించారు. పెదవేగి మండలం దుగ్గిరాల చింతమనేని కార్యాలయంలో తనను కలిసిన జేడీ జయప్రకాష్‌తో వసతి గృహాల్లో విద్యార్థులకు అందిస్తున్న సేవలు, అందుతున్న సౌకర్యా లను చింతమనేని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ వసతి గృహాల్లో చదివే విద్యార్థులు అధిక శాతం పేద కుటుంబాలకు చెందినవారని, అలాంటి వారి ఆశలకు అనుగుణంగా అన్ని వసతులను కల్పించాలన్నారు. జేడీ వెంట సహాయ అధికారి రమేష్, సిబ్బంది ఉన్నారు. అనంతరం ఎమ్మెల్యే రాట్నాలకుంట శ్రీరాట్నాలమ్మను దర్శించుకున్నారు. అర్చకులు ఎమ్మెల్యే ప్రభాకర్, రాధారాణి దంపతులకు వేదాశీ ర్వాదం అందజేశారు. ఆలయ కమిటీ మాజీ చైర్మన్ రాయల ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో అర్చకులు ఎమ్మెల్యే దంపతు లకు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందిం చి, ఆశీర్వదించారు.

చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేస్తాం

ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్


అభినందన సభలో మాట్లాడుతున్న రోషన్‌కుమార్

చింతలపూడి, జూన్ 18: చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయిస్తానని, చింతలపూడి నుంచే పరిపాలన సాగిస్తానని, ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో వివిధ శాఖల అధికారులతో మంగళవారం సమీక్షించారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం గత తెలుగు దేశం ప్రభుత్వంలోనే చాలా భాగం పూర్తి అయిందని, ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో గుప్పెడు మట్టి పని కూడా చేయలేదన్నారు. గత ప్రభుత్వం హయాంలో వ్యవస్థ లన్ని కుంటుపడ్డాయన్నారు. అభివృద్ధి, సంక్షేమం, పాలనపై దృష్టిపెట్టి పరిపాలన చేస్తామన్నారు. అంతకు ముందు ఆర్ఆర్ ఫంక్షన్ హాల్లో ఆయనకు ఆత్మీయ అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన అక్కడ మాట్లాడుతూ వంద రోజుల పరిపాలన పై ప్రణాళిక కూడా సిద్ధం చేశానన్నారు. కూటమి శ్రేణులు భారీగా తరలివచ్చి ఆయన పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందనలు తెలిపా రు. టీడీపీ నాయకులు జగ్గవరపు ముత్తారెడ్డి, చిట్లూ రి ధర్మరాజు, మాటూరి వెంకటరామయ్య, చలపతి రావు, మధుబాబు, విజయ్‌కుమార్, శేషగిరి, చింతలపూడి, లింగపాలెం మండలాల నుంచి క్యాడర్‌తో పాటు ప్రజలు తరలివచ్చారు. అనంతరం చింతలపూడికి చెందిన టీడీపీ కార్యకర్త కుంషావ లీని ఎమ్మెల్యే రోషన్‌కుమార్ పరామర్శిం చారు. ఇటీవల అతనికి గుండెకు స్టంట్ వేయడంతో ఇంటి వద్దే విశ్రాంతి తీసుకుంటున్నారు.

- లింగపాలెం : అసంపూర్తిగా ఉన్న గ్రామ రహదారులను వెంటనే పూర్తి చేస్తామని చింతలపూడి నియోజకవర్గ ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు ధర్మాజిగూడెంలోని రామాలయంలో మంగళవారం 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులతో సమీక్ష జరిపి అభివృద్ధి పనులపై చర్చిస్తానన్నారు. గరిమెళ్ళ చలపతిరావు, మోరం పూడి మల్లి ఖార్జున్‌రావు, తాతిన రాధాకృష్ణ, అసిలేటి అజయ్, గారపాటి బుజ్జియ్య, మోరంపూడి ప్రసాద్, ముసునూరి రాము, రాయంకుల చక్రధర్ రావు, కుర్రా సుబ్రహ్మణ్యేశ్వర రావు ప్రసాద్, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ


చింతలపూడిలో విద్యార్థినికి పుస్తకాలు అందిస్తున్న ఎమ్మెల్యే రోషన్‌కుమార్

చింతలపూడి, జూన్ 18: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ మంగళవారం కిట్‌లను పంపిణీ చేశారు. స్థానిక ప్రభుత్వ హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న 285 పాఠశాలల్లో 22,062 మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. 1,166 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారని, విద్యార్థులకు మంచి విద్యాబోధన అందించాలని సూచించారు.

- నిడమర్రు : విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు తండ్రి పత్సమట్ల లచ్చిరాజు అన్నారు. పత్తేపురం ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం లచ్చిరాజు కిట్లు పంపిణీ చేశారు. సర్పంచ్ నీలపాల సాయిప్రియ, వైస్ సర్పంచ్ రుద్రరాజు కొండ య్యరాజు, పొత్తూరి నరసింహరాజు, నడింపల్లి భీమరాజు, పత్సమట్ల లక్ష్మీపతిరాజు, పీసీ చైర్మెన్ నడింపల్లి శ్రీదేవి, పాఠశాల హెచ్‌యం పీవీ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.
- కుక్కునూరు :విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. కుక్కునూరు మండలంలో 65 పాఠశాలలో 3,500 మంది విద్యార్థులు చదువున్నారు. తొమ్మిదో తరగతి మినహా 22,500 పాఠ్యపుస్తకాలు ఎంఈవో కార్యాలయం లో ఉన్నాయి. మండల విద్యాశాకాధికారి భగవాన్ దాస్ అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పుస్తకాలను పంపిణీ చేశారు. తద్వారా ప్రధానోపాధ్యాయుల ద్వారా విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ ప్రారంభమైంది.

గ్రామాల్లో పారిశుధ్య పనులు ప్రారంభం


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కూటమి నేతలు

దెందులూరు,జూన్ 18 : గత వైసీపీ ప్రభుత్వం నిర్వాకంతో పారిశుధ్య నిర్వహణ లేక గ్రామాలు అధ్వానంగా మారాయి. దెందులూరు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లిన ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ చెత్తా,చెదారం చూసి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసి వెంటనే పారిశుధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. దీంతో పారిశుధ్య దద్దదధదసిబ్బంది చెత్త తరలించే పనులు చేపటారు. దెందులూరుకు డంపింగ్ యార్డు లేకపోవడంతో వెంటనే స్థల సేకరణ చేయాలని చింతమనేని అధికారులకు సూచించారు. గాలాయగూడెంలో పారిశుధ్య పనులను టీడీపీ మండల తెలుగు యువత అధ్యక్షుడు ఏనుగు రామకృష్ణ, జనసేన నాయకుడు పెద్దిశెట్టి నాని, బీజేపీ మండ అధ్యక్షుడు మందారి బుజ్జిగోపాల్ పర్యవేక్షి స్తున్నారు. గ్రామ టీడీపీ అధ్యక్షుడు పూజారి శ్రీనివాసరావు, పవన్ కల్యాణ్ అభిమాన సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు పూజారి వెంకటరత్నంనాయుడుతో పాటు పంచాయతీ సిబ్బంది, కార్యదర్శి ఉన్నారు.

పేదలకు సేవ చేయడమే 'సంకల్పం' ట్రస్ట్ లక్ష్యం


వసతి గృహానికి నిత్యావసర సరుకులు అందజేస్తున్న సభ్యులు

ఏలూరు కల్చరల్, జూన్ 18: పేద ప్రజలకు సేవ చేయాలనే ఆశయంతో ఏదైనా సాధించ వచ్చుననే దృక్పథంతో సంకల్పం ట్రస్ట్ ప్రారంభించినట్లు ట్రస్ట్ వ్యవస్థాపకులు, ఎన్ఆర్ఐ ఆలపాటి సంగ్రామ్ పేర్కొన్నారు. ఆయన కుమార్తె అన్విత పుట్టిన రోజు సంద ర్భంగా మంగళవారం తంగెళ్ళమూడిలోని విన్సెంట్‌డీపాల్ రిహాబిలిటేషన్ సెంటర్ (శారీరక,మానసిక) దివ్యాంగుల వసతిగృహానికి 75 కేజీల బియ్యం, 20 లీటర్లు మంచినూనె, 20 కేజీల సర్ఫ్, 50 కేజీల కందిపప్పు, ఒకరోజు భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంగ్రామ్ మాట్లాడుతూ పేదలకు సాయం చేయాలన్నా సంకల్పంతో కులమతాలకు అతీతంగా సహాయపడాలనే సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే పేదలకు అవసరమైన సేవా కార్యక్రమాలు చేపట్టామని, సేవే అంతిమంగా సంకల్పం ట్రస్ట్ పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ట్రెజరర్ హరిరాజు, దూళిపాళ్ళ ప్రసాద్, యోగేంద్ర, వర్మ తదితరులు పాల్గొన్నారు.

రోటరీక్లబ్ సేవలు ప్రశంసనీయం


ప్రకృతి వ్యవసాయ రైతు చక్రపాణికి పురస్కారం అందజేస్తున్న క్లబ్ సభ్యులు

ఏలూరు కల్చరల్, జూన్ 18: రోటరీ క్లబ్ సంస్థ ప్రపంచ వ్యాప్తంగా చేస్తున్న సేవలు అభినందనీయమ ని, నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ ఏలూరు ఆధ్వర్యం లో ఒకేషనల్ అవార్డ్స్ ప్రదానోత్సవ కార్యక్రమం స్థానిక వీటీఆర్, కృష్ణా రెసిడెన్సీ ప్రాంగణంలో క్లబ్ అధ్యక్షుడు ఎన్.రోహిత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్స్‌లెన్స్ సర్వీస్ అవార్డును ప్రకృతి వ్యవసా య రైతు ఉప్పలపాటి చక్రపాణికి ఒకేషనల్ సర్వీస్ అవార్డును వీణ సంగీత విద్వాంసురాలు జయలక్ష్మి, రామచందర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా పెదబాబు మాట్లాడుతూ దేశంలో ఉన్న రుగ్మతల ను నిర్మూలించటానికి పలు సంస్థలు ముందుకు వచ్చి సేవలు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఒకేషనల్ సర్వీస్ డైరెక్టర్ జి.రాజేశ్వరరావు, కార్యదర్శి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరటి రైతులను ఆదుకోవాలని వినతి



పోలవరం, జూన్ 18: : కన్నాపురం అడ్డరోడ్డు సమీ పంలో ఉన్న అరటి పంటలు గత నాలుగు రోజుల క్రితం వీచిన ఈదురు గాలులకు నేల కూలాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఐదెకరాలలో పంట వేశామ ని, గెలలు దిగిన తొలి దశలోనే అరటి పంట నేలకూలడంతో భారీగా నష్టపోయామని ప్రభుత్వం ఆదుకోవాలని పట్టిసీమ అరటి రైతులు పందిటి సూరిబాబు, పందిటి సత్యనారాయణ, రామకృష్ణ, కాటం రాజు తదితరులు విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో మండల హార్టికల్చర్ అధికారి టి.రవిని సంప్రదించగా తమ దృష్టికి ఎకరం మాత్రమే వచ్చిందని క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

దోమల మందు పిచికారీ

ఏలూరు ఎడ్యుకేషన్ : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ మలేరియా విభాగం సహకారంతో నగర పరిధిలోని సంక్షేమ వసతి గృహాలు, టాయిలెట్ల పరిసరాల్లో మంగళవారం నుంచి దోమల మందు పిచికారీ ప్రారంభించినట్టు మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మాలతి తెలిపారు. అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు, వేణు, శ్రీనివాసరావు, రమేష్‌బాబు, దుర్గారావు, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఖాతాలకు పీఎం కిసాన్ నిధుల జమ


పోలవరంలో పీఎం కిసాన్ లాంచింగ్ ప్రత్యక్ష ప్రసారం వీక్షిస్తున్న కూటమి నాయకులు, అధికారులు

పోలవరం, జూన్ 18 : పీఎం కిసాన్ నిధుల లాంచింగ్ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని పోలవరం రైతు భరోసా కేంద్రంలో మంగళవారం కూటమి నాయకులు వీక్షించారు. మండలానికి చెందిన 3,792 మంది రైతులకు రూ.75 లక్షల 84 వేలు నేరుగా వారి ఖాతాలకు జమవుతాయని ఎంఏవో రాంబాబు తెలిపారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కరిబండి నాగరాజు, జనసేన మండల అధ్యక్షుడు గునపర్తి చిన్ని, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బొరగం వెంకటలక్ష్మి, బీజేపీ మండల అధ్యక్షులు కామిశెట్టి నాగరాజు, నాయకులు కరిబండి ప్రభాకర్, కారిపిరెడ్డి వెంకటేశ్వ రరావు, పసుపులేటి కృష్ణారావు రైతు భరోసా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

- చింతలపూడి : పీఎం కిసాన్ యోజన పథకంలో భాగంగా సబ్ డివిజన్ పరిధిలోని 30,105 మంది రైతులకు రూ.ఆరు కోట్ల రెండు లక్షల 10 వేలు మంజూరు అయ్యాయని, వీటిని నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తారని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు నాగకుమా ర్ తెలిపారు. అర్హులైన రైతులు నిధులు జమ కాకపోతే అధికారుల దృష్టికి తీసుకురావాలని, రైతు భరోసా కేంద్రాల్లో ఇంచార్జిలను సంప్రదించాలని సూచించారు.
- భీమడోల : మండలంలోని 3,256 మంది రైతులకు రూ.65 లక్షల 12 వేల నగదు పీఎం కిసాన్ యోజన పథకంలో రైతుల ఖాతాలకు చేరాయని భీమడోలు మండల వ్యవసాయాధికారిణి ఉషారాణి తెలిపారు. ఈ మేరకు భీమడోలులోని ఆరోగ్య శ్రీ కేంద్రంలో రైతులు బీజేపీ నేతలతో సమావేశం నిర్వహించారు. మొదటి విడత రూ.రెండు వేలు జమ కానున్నాయని తెలిపారు. బీజేపీ నాయకులు ప్రవీణ్‌పటేల్, రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన ఎమ్మెల్యే ధర్మరాజు


నిర్మలా సీతారామన్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యే పత్సమట్ల

ఉంగుటూరు, జూన్ 18 : ఢిల్లీలో కేంద్ర మంత్రి నిర్మలా సీతారా మన్‌ను ఉమ్మడి పశ్చి మ గోదావరి జిల్లాల ఎమ్మెల్యేలు మంగళ వారం కలిశారు. ఉంగు టూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన చంటి



ఏలూరు రూరల్, జూన్ 18: ఎమ్మెల్యే బడేటి చంటి పలు వురు రాష్ట్ర మంత్రులను కలిసి పలు అంశాల పై చర్చిస్తున్నా రు. మానవ వనరులు, ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్, ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్రను మంగళవారం చంటి మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. అమరావతిలోని మంత్రుల చాంబర్‌లలో కలిసి పుష్పగుచ్ఛాలు ఇచ్చ అభినందించారు. నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించారు. నిధులు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కేంద్ర మంత్రి వర్మను కలిసిన తపనా చౌదరి



ఏలూరు రూరల్, జూన్ 18: ఢిల్లీలో పరిశ్రమలు, ఉక్కు శాఖా మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నరసాపురం ఎంపీ భూపతిరాజు శ్రీనివాసవర్మను బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

హోం మంత్రిని కలిసిన మేఘలాదేవి



కొయ్యలగూడెం, జూన్ 18: రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ సెక్రటరి గంగిరెడ్ల మేఘలాదేవి హోం మం త్రి వంగలపూడి అనితను మంగళవారం అమరావ తిలో కలిసి అభినందన లు తెలిపారు. ఈమె వెంట పలువురు మహిళలు ఉన్నారు.

ఎంపీ పురందేశ్వరికి సత్కారం



ద్వారకాతిరుమల, జూన్ 18: రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరిని టీడీపీ మండల నాయకులు మంగళవారం సత్కరించారు. ఈ క్రమంలో రాజమహేంద్ర వరంలోని ఆమె నివాసంలో టీడీపీ మండల అధ్యక్షుడు లంకా సత్యనారాయణ, పోలిన శ్రీనివాసరావు, జడ్పీటీసీ మాజీ సభ్యులు డీవీఎస్ చౌదరి తదితరులు ఆమెను కలసి ముందుగా శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి, చినవెంకన్న మెమొంటో ఇచ్చి సత్కరించారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు


ఎమ్మెల్యే మద్దిపాటిని సత్కరిస్తున్న సర్పంచ్ శ్రీహరి తదితరులు

ద్వారకాతిరుమల, జూన్ 18: గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు సమక్షంలో జి.కొత్తపల్లి గ్రామ వైసీపీ సానుకూల సర్పంచ్ కస్సే శ్రీహరిరావు, పలువురు వార్డు మెంబర్లు, కార్యకర్తలు మంగళవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆ గ్రామ కమిటీ అధ్యక్షుడు, మండల క్లస్టర్ ఇన్‌చార్జి రేగంటి రాంబాబు ఆధ్వర్యంలో సుమారు 50 మంది వైసీపీ కార్యకర్తలు నల్లజర్లలోని గోపాలపురం నియోజకవర్గ పార్టీ కార్యాలయానికి వెళ్లి ఎమ్మెల్యేను కలసి పార్టీలో చేరారు. వారికి ఆయన పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. మాజీ సర్పంచ్ జొన్నకూటి అంకాలయ్య, కస్సే చక్రధరరావు, పులపాకుల ఘంటాలు, మిండా వెంకటేశ్వరరావు, చిన్ని సుబ్బారావు, తోటకూర నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జనసేనలో భారీ చేరికలు



అప్పలనాయుడుకు పూల బొకే ఇస్తున్న యువకులు

ఏలూరు కార్పొరేషన్, జూన్ 18 : నగరంలోని పలు డివిజన్లకు చెందిన మాల మహానాడు నాయకులు మంగళ వారం పవరుపేట జనసేన కార్యాలయంలో జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడు సమక్షంలో పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాను కప్పి అప్పలనాయుడు సాదరంగా ఆహ్వానించారు. అప్పలనాయుడు మాట్లాడుతూ పార్టీ విధి విధానాలకు అనుగుణంగా ఉండాలన్నారు. కూటమి హామీలు అమలయ్యేందుకు కార్యకర్తలు, నాయకులు ప్రభుత్వానికి సహకరించాలన్నారు. మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు అబ్బూరి అనీల్‌బాబు, ఏలూరు జిల్లా జనరల్ కార్యదర్శి పద్మారావు, మండల అధ్యక్షులు కర్రి శంకర్, టౌన్ కార్యదర్శి కల్లేపల్లి దుర్గారావు, మునిసిపల్ గ్రీన్ వెహికల్ యూనియన్ అధ్యక్షులు రాజు, సభ్యులు సుగుణరావు, గణేష్, జనసేన నాయకులు నగిరెడ్డి కాశీ నరేష్, పల్లి విజయ్, దాసరి బాబి, రెడ్డి గౌరీశంకర్, వేముల బాలు, ఎట్రించి ధర్మేంద్ర, రవి, పైడి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

టి.నరసాపురం, జూన్ 18 : కేతవరం 11 కేవీ ఫీడర్ ఆర్‌డీఎస్ఎస్ పనులు జరుగుతున్న దృష్ట్యా బుధవారం నుంచి ఈ నెల 21 తేదీ వరకు ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని జంగారెడ్డిగూడెం డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.రాధాకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.



చాట్రాయిలో లైన్‌మన్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు

లైన్‌మన్ తీరుపై రైతుల ఆగ్రహం

ట్రాన్స్‌ఫార్మర్లు సకాలంలో మరమ్మతులు చేయలేదని నిరసన

చాట్రాయి, జూన్ 18: వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే 48 గంటల్లో మరమ్మతు చేసి బిగించాల్సి ఉండగా 10 రోజులైనా దిక్కులేదని, ఫలితంగా వరినారు మళ్ళు ఎండిపోతున్నాయని, కిరాయిల పేరుతో వసూళ్ళకు పాల్పడుతున్నారని చాట్రాయి లైన్‌మన్ రాజు తీరుపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం చాట్రాయి సబ్‌స్టేషన్‌కు వచ్చిన రైతులు తమ సమస్య పరిష్కరించాలని ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కొండపల్లి సత్యనారాయణరెడ్డి, రేగళ్ళ శ్రీనివాసరెడ్డి తదితరులైన 8 మంది రైతులకు చెందిన 2 వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు 5వ తేదీన కురిసిన వర్షానికి పిడుగులు పడి కాలిపోవటంతో, 10 రోజుల క్రితం మరమ్మతులు నిమిత్తం విద్యుత్ సిబ్బంది తీసుకువెళ్ళారని అన్నారు. వాటికి మరమ్మతుల కోసం నూజివీడు తీసుకువెళ్ళి మళ్ళీ తీసుకురావటానికి, కిరాయి ఇవ్వాలని లైన్‌మన్ అడగగా తాము ఇవ్వమని చెప్పామన్నారు. దీనితో 10 రోజుల నుంచి ట్రాన్స్‌ఫార్మర్లు బిగించకుండా ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. అధికారులు వచ్చి తమ సమస్య పరిష్కరించకపోతే సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని రైతులు హెచ్చరించడంతో ఏఈ సంజయ్ వచ్చి ట్రాన్స్‌ఫార్మర్లు బిగించటానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వటంతో రైతులు శాంతించారు. భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కార్యదర్శి శీర్గం వేణుగోపాలరెడ్డి, సంఘ్ నాయకుడు రేగళ్ళ చెన్నారెడ్డి, టీడీపీ గ్రామ అధ్యక్షుడు గడ్డం ప్రభాకరరెడ్డి, చాట్రాయి రైతులు పాల్గొన్నారు.

పట్టుబడిన వాహనాల వేలం

నూజివీడు టౌన్, జూన్ 18: నూజివీడు పట్టణంలోని సెబ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను మంగళవారం వేలం వేశారు. 14 వాహనాలకు రూ. 2,70,000 ధరను నిర్ణయించగా, రూ. 3,28,230లు లభించినట్లు సీఐ వెంకటరమణ తెలిపారు. నిలిచిపోయిన మరో ఆరు వాహనాలకు త్వరలో వేలంపాట నిర్వహిస్తామని ఆయన తెలిపారు.



అనధికార మద్యం ధ్వంసం

నూజివీడు, జూన్ 18: నూజివీడు సెబ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన అనధికార మద్యాన్ని సెబ్ ఏలూరు జిల్లా సూపరింటెండెంట్ కొటారి రామకృష్ణ ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ మద్యం రవాణా, విక్రయాలు చేపడుతున్న వారిపై దాడులకు ప్రత్యేక దళాలను నియమించినట్లు తెలిపారు. నూజివీడు సర్కిల్ పరిధిలో ఏప్రిల్, మే నెలల్లో దాదాపు 47 కేసుల్లో పట్టుబడిన 2,245 లీటర్ల సారా, 2065 మద్యం బాటిళ్ళు, 233 బీరు బాటిళ్ళను మంగళవారం ధ్వంసం చేశారు. నూజివీడు సెబ్ సీఐ టి.వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం సమాచారం

కడుపు నొప్పి తాళలేక ఆత్మహత్య

ముసునూరు, జూన్ 18: మండలంలోని చెక్కపల్లికి చెందిన రెడ్డి నరసింహారావు (43) వ్యవసాయం, కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో సోమ వారం తీవ్రంగా కడుపునొప్పి రావడంతో పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బంధువులు అతనిని నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించగా, మెరుగైన వైద్యం కోసం వైద్యులు విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించా రు. చికిత్స పొందుతూ నరసింహారావు మంగళవారం మృతి చెందాడు. మృతు డి తండ్రి ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి. వాసు తెలిపారు.

డిక్కీలో రూ. 5 లక్షలు మాయం

భీమవరంక్రైం, జూన్ 18 : భీమవరం పట్టణంలోని ఓ బ్యాంకు వద్ద ద్విచక్ర వాహనాన్ని పార్కు చేసి తిరిగి వచ్చేసరికి అందులో ఉంచిన ఐదు లక్షల రూపాయలను దుండగులు చోరీ చేశారు. భీమవరం ఒకటో పట్టణంలోని బుధవారం మార్కెట్లో మంగళవారం జరిగింది. పెనుమంట్ర మండలం మార్టేరు గ్రామానికి చెందిన చెర్ల రవిశంకర్‌రెడ్డి తన ద్విచక్ర వాహనంపై మంగళవారం భీమవరం వచ్చారు. తనతో తెచ్చుకున్న ఐదు లక్షల రూపాయలను వాహనం డిక్కీలో ఉంచి బ్యాంకుకు వెళ్లి తిరిగి వచ్చేసరికి సొమ్ము మాయమైంది. దీనిపై వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.



పంచాయతీల వద్ద నిరుపయోగంగా ఉన్న ఎలక్ట్రిక్ వాహనాలు

గాలికొదిలేశారు..

- నిరుపయోగంగా చెత్త తరలింపు వాహనాలు
- నూజివీడు నియోజకవర్గంలో రూ.4 కోట్ల ప్రజాధనం వృథా

నూజివీడు టౌన్, జూన్ 18: ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు వస్తూ ఉంటాయి పోతూ ఉంటాయి. కాని ప్రజాధనాన్ని నిరుపయోగం కాకుండా పరిరక్షించి, వాటిని సద్వినియోగం పరచాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులపై ఉంటుంది. కాని ఓ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మరో ప్రభుత్వానికి వ్యర్థ ప్రయోజనంగా మారుతుందనేందుకు నిదర్శనం ఈ చిత్రం. గత తెలుగుదేశంపార్టీ ప్రభుత్వ హయాంలో స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా తడిచెత్త, పొడిచెత్తను సంపద సృష్టికేంద్రాలకు తరలించేందుకు పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్ చెత్త తరలింపు వాహనాలను కొనుగోలు చేశారు. సంపద సృష్టికేంద్రాల ద్వారా చెత్తనుండి చేలకు ఎరువును తయారుచేసే విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చి తద్వారా చెత్తనుంచి సంపద సృష్టించాలని నాడు సీఎం చంద్రబాబునాయుడు నిర్ణయం తీసుకుని, ప్రతి గ్రామంలోనూ రెండున్నర లక్షల వ్యయంతో సంపద సృష్టికేంద్రాలు నిర్మాణం, సుమారు రూ.5లక్షల వ్యయంతో వాహనాలను కొనుగోలు చేశారు. వాటిని ఆయా పంచాయతీలకు తరలించినా అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వం సదరు వాహనాలను వినియోగంలోకి తీసుకురాలేదు సరికదా, వాటి స్థానంలో రిక్షాలను ఏర్పాటుచేసి చెత్త తరలింపు చేపట్టాలని సూచించింది. అయితే అధికారులు సైతం ప్రజాధనం నిరుపయోగం అవుతున్న విషయాన్ని ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళ్ళకుండా వదిలివేయడంతో ఇదిగో ఇలా ప్రతి పంచాయతీ వద్ద ఎలక్ట్రిక్ వాహనాలు తుప్పుపట్టి నిరుపయోగంగా మారాయి. ఒక్క నూజివీడు నియోజకవర్గంలోనే నిరుపయోగంగా వదిలివేసిన విద్యుత్ వాహనాల రూపేణా దాదాపు రూ.4 కోట్ల ప్రజాధనం వృథాగా అయిందని, తిరిగి టీడీపీ అధికారం చేపట్టిన నేపథ్యంలో సదరు వాహనాలకు కొద్దిపాటి మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తేవాలని పలువురు కోరుతున్నారు.

నిధులు వెనక్కి..

- శ్మశాన వాటికల అభివృద్ధిని పట్టించుకోని గత ప్రభుత్వం
- విజ్ఞప్తులు బేఖాతర్.. సౌకర్యాలు నిల్
- వర్షాకాలంలో కర్మకాండలకు తీవ్ర ఇక్కట్లు

ముసునూరు, జూన్ 18: మండల వ్యాప్తంగా గల శ్మశాన వాటికల్ని పట్టించుకోకపోవడంతో పిచ్చిమొక్కలు, ముళ్ళకంచెలు ఏపుగా పెరిగి చిట్టడవులను తలపిస్తున్నాయి. దహన సంస్కారాలు నిర్వహించేందుకు వచ్చినవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల వ్యాప్తంగా 16 గ్రామాలు ఉండగా, 13 గ్రామాల్లో 24 శ్మశాన వాటికలు ఉన్నాయి. అయితే గత ప్రభుత్వంలో ఉపాధి నిధులతో చెక్కపల్లి, గుళ్ళపూడి, ఓసీ ఏరియాలోని శ్మశాన వాటికలను అభివృద్ధి చేశారు. ముసునూరు శ్మశాన వాటిక అభివృద్ధికి నిధులు మంజూరైనా, పనులు చేపట్టకపోవడంతో ఆ నిధులు సైతం వెనక్కివెళ్ళాయి. మిగిలిన గ్రామాల్లో ఉన్న శ్మశాన వాటికలు ఈ ఐదేళ్ళల్లో అభివృద్ధి లేక కనీస మౌలిక సదుపాయాలు సైతం లేకపోవడంతో కర్మకాండలు చేసేందుకు వచ్చిన వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అక్కిరెడ్డిగూడెం, వలసపల్లి, యల్లాపురం గ్రామాల్లో శ్మశాన వాటికలకు నేటికీ స్థలాలు కేటాయించలేదు. ఆయా గ్రామాల్లో తమ్మిలేరులోనే కర్మకాండలు నిర్వహించుకుంటున్నారు. ఈ స్థలాల కేటాయింపు కోసం ఈ ఐదేళ్ళల్లో పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు అర్జీలు దాఖలు చేసినా నేటికి ఆ ప్రక్రియ చేపట్టిన నాథుడే లేడు. అయితే శ్మశాన వాటికల్లో కనీసం నీరు, విద్యుత్ సౌకర్యం కూడా లేకపోవడంతో స్థానికులు నరకం చూస్తున్నారు. వర్షాకాలం వచ్చిందంటే శ్మశాన వాటికల్లో కర్మకాండలు చేయలేని పరిస్థితి నెలకొంటుంది. ఐదేళ్ళ వైసీపీ పాలనలో శ్మశాన వాటికల అభివృద్ధికి నిధులు కేటాయించలేదని, వాటికి స్థలాలు కేటాయింపు కూడా జరగలేదని, ప్రభుత్వాలు మారుతున్నా శ్మశాన వాటికల అభివృద్ధి జరగడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా శ్మశాన వాటికల అభివృద్ధిపై ప్రభుత్వం, అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి శ్మశాన వాటికలు లేని గ్రామాల్లో స్థలాలు కేటాయించాలని స్థానికులు కోరుతున్నారు.



ముసునూరు శ్మశాన వాటికలో పెరిగిపోయిన తుప్పలు

కైకలూరుకు బ్రాండ్ ఇమేజ్ తేవాలి

- అభివృద్ధిలో అధికారులు కీలకంగా వ్యవహరించాలి
- మార్కెట్ కూల్చివేతపై సీఐడీ విచారణ : ఎమ్మెల్యే డాక్టర్ కామినేని

కైకలూరు, జూన్ 18: నియోజకవర్గ అభివృద్ధిలో అధికారులు కీలకపాత్ర వహించాలని, కైకలూరుకు బ్రాండ్ ఇమేజ్‌ను తీసుకు రావాలని కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. మంగళవారం నియోజకవర్గ అధికారులతో ఆయన సమన్వయ సమావేశం నిర్వహించి మాట్లాడుతూ కూల్చివేసిన అబ్దుల్ మజీద్ మార్కెట్‌పై సీఐడీ విచారణ చేయిస్తానన్నారు. ఎక్కడ చేపల చెరువులు మరమ్మతు చేసుకోవాలన్నా అధికారుల అనుమతి అవసరం లేదన్నారు. కొత్త చెరువుల తవ్వకాలకు త్వరలో కమిటీని పునరుద్ధరిస్తానన్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికి 108 గ్రామాల్లో జలజీవన్‌మిషన్ ద్వారా నూతన పైప్‌లైన్‌ల నిర్మాణం, ఆర్వోప్లాంట్లు ఏర్పాటు చేస్తామన్నారు. కైకలూరులో ప్రత్యేక డంపింగ్ యార్డ్ నిర్మిస్తానని, పంచాయతీలకు నిధులు సమకూర్చడంలో కీలకపాత్ర వహిస్తానన్నారు. రాజకీయాలకతీతంగా పోలీసులు విధులు నిర్వహించాలన్నారు. జాతీయ రహదారి నిర్మాణ పనులకు మాత్రమే టిప్పర్ల ద్వారా ఇసుక తరలించాలని ఇతర చోట్లకు తరలిస్తే రెవెన్యూ పోలీసు అధికారుల వాహనాలను సీజ్ చేయాలని ఆదేశించారు. ట్రాక్టర్ల ద్వారా ఇసుక తోలుకునే రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దన్నారు. పేదలకు వైద్య సదుపాయం అందేలా వైద్య సిబ్బంది పనిచేయాలన్నారు. డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సత్యనారాయణ, ఈఈ త్రినాధ బాబు, ఎలక్ట్రికల్ ఈఈ రామకృష్ణ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యాశాఖలో వినూత్న మార్పులు

ఈ విద్యాసంవత్సరంలో విద్యాశాఖలో వినూత్న మార్పులతో విద్యార్థులకు బోధన సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కైకలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కిట్లను పంపిణీ చేశారు. పాఠ్యపుస్తకాలపై మాజీ సీఎం జగన్ చిత్రం ఉన్నప్పటికీ చంద్రబాబు వాటినే పంపిణీ చేయాలనడం ఆయన వ్యక్తిత్వానికి నిదర్శనమన్నారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, ఎంపీపీ కృష్ణ, జడ్పీటీసీ బేబి, డీఈవో అబ్రహం, డీవైఈవో రవిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కామినేని

ముదినేపల్లి: విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని కామినేని అన్నారు. ముదినేపల్లి జడ్పీ హైస్కూల్‌లో పుస్తకాలు పంపిణీ చేశారు. ఆర్యవైశ్య సంఘ నాయకులు 200 నోట్బుక్కులు, పెన్నులు కామినేని ద్వారా అందజేశారు.

మండవల్లి: స్కూళ్లల్లో రాజకీయాలకతీతంగా పనిచేయాలని కామినేని పేర్కొన్నారు. మండవల్లి హైస్కూల్లో పాఠ్యపుస్తకాల కిట్లను పంపిణీ చేసి మాట్లాడుతూ దాతల సహకారంతో పాఠశాలలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. మండవల్లి జడ్పీటీసీ ముంగర విజయనిర్మల, ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, కూటమి నేతలు పాల్గొన్నారు.

కలిదిండి: విద్యతోనే దేశాభివృద్ధి అని బడి ఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించాలని కామినేని శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఆరుతెగలపాడు జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, కిట్లు పంపిణీ చేశారు. తహసీల్దార్ దశిక వంశీ, ఎంపీడీవో దినతేజ్, ఎంఈవో ప్రభాకర్ బాబు పాల్గొన్నారు.

చురుగ్గా తాత్కాలిక వంతెన నిర్మాణం



కలిదిండి, జూన్ 18 : పెద కొమ్ములేరుపై కూలిన పోతుమర్రు - కొండూరు వంతెన స్థానంలో తాత్కాలిక వంతెన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతు న్నాయి. శిథిలాలను యుద్ధప్రాతిపదికన తొలగిస్తున్నారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ చొరవతో ఆర్‌అండ్‌బీ అధికారులు రంగంలోకి దిగారు. ఇనుప గడ్డర్లతో తాత్కాలిక వంతెన సత్వరం పూర్తి చేయటానికి సన్నాహాలు చేస్తున్నారు. పెదకొమ్ములేరు డ్రెయిన్‌లో నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. వంతెన కూలి పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ఆక్వా రైతులు ఇబ్బందులు పడుతుండటంతో తాత్కాలిక వంతెన నిర్మాణాన్ని నాలుగైదు రోజుల్లో పూర్తి చేయటానికి సన్నాహాలు చేస్తున్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి వెయ్యి కాజాల సమర్పణ



కైకలూరు, జూన్ 18: కైకలూరు చిన్న చెరువు గట్టుపై గల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కి విశేష పూజలను నిర్వహించారు. ప్రతి నెలా 3వ మంగళవారం స్వామివారికి పూజలు నిర్వహించడంతో పాటు వేలాది మందికి అన్నసమారాధన నిర్వహిస్తుంటారు. కైకలూరుకు చెందిన చెక్కా వెంకట సుబ్బారావు వెయ్యి కాజాలను స్వామివారికి అందజేశారు. అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించి ప్రసాదాన్ని అన్నదాన కార్యక్రమంలో వినియోగించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాలు

కలిదిండి, జూన్ 18 : ఆవకూరులో అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ విఠల్ రావు స్వామివారికి పూజలు చేశారు. సొసైటీ మాజీ అధ్యక్షురాలు చలమలశెట్టి లక్ష్మీపార్వతి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కామినేనికి అధికారుల సత్కారం



ముదినేపల్లి, జూన్ 18 : కైకలూరు నియోజకవర్గం నుంచి ఘన విజయం సాధించి తొలిసారిగా ముదినేపల్లి వచ్చిన ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్‌ను మండల అధికారులు ఘనంగా సత్కరించారు. ముదినేపల్లి హైస్కూల్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో గంగాధరరావు, మండల పరిషత్ కార్యాలయ ఏవో రమణబాబు, సిబ్బంది, ఎంఈవో నరేష్ కుమార్ తదితరులు కామినేని సత్కరించారు.

ప్రభుత్వ బడుల్లో ప్రవేశాలు ప్రారంభం



ముదినేపల్లి, జూన్ 18 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పిం చేందుకు ఉపాధ్యాయులు నాలుగు రోజులుగా చేస్తున్న ప్రయత్నాలు నేపథ్యంలో మంగళ వారం పెయ్యేరు ఎలిమెంటరీ పాఠశాలలో ఒకటవ తరగతిలో నలుగురు విద్యా ర్థులు చేరగా, వారికి హెచ్ఎం బేతాళ రాజేంద్ర ప్రసాద్ అడ్మిషన్ పత్రాలు అందజేశారు. తల్లికి వందనం పథకం కింద ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే వారందరికీ ఇస్తున్న ఆర్థిక ప్రయోజనాన్ని సద్వినియోగం చేసుకోవాలని హెచ్ఎం కోరారు.

కూటమి విజయంతో కోటప్రోలుకు సత్కారం



ముదినేపల్లి, జూన్ 18 : డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఘన విజయం సాధించటం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట ప్రోలు కృష్ణారావును ముదినేపల్లి మండల పరిషత్ అధికారులు సత్కరించారు. మంగళవారం పెయ్యేరు ఆటోనగర్‌లోని ఆయన స్వగృహంలో కృష్ణారావును ఏవో రమణ బాబు, సిబ్బంది సత్కరించారు.



రావిచర్లలో పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న కాపా శ్రీనివాసరావు



పోలవరం పాఠశాలలో పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న నాయకులు

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

నూజివీడు టౌన్: ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను వినియోగించుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని నూజివీడు ఏఎంసీ మాజీ చైర్మన్ కాపా శ్రీనివాసరావు ఆకాంక్షించారు. నూజివీడు మండలం రావిచర్లలో పాఠ్యపుస్తకాల పంపిణీని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. హెచ్ఎం షరీఫ్, టీడీపీ నాయకులు ముల్లంగి మోషే, రామకృష్ణ, వెంకట్ తదితరులు పాల్గొన్నారు. నూజివీడు బాలికోన్నత పాఠశాలలో నూజివీడు మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై స్టూడెంట్స్ కిట్స్‌ను పంపిణీ చేశారు.

సర్కార్ బడులకు పూర్వ వైభవం

చాట్రాయి: కూటమి ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చి, సర్కార్ బడులకు పూర్వవైభవం తీసుకువస్తుందని టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు మరిడి చిట్టిబాబు, మాజీ సర్పంచ్ సత్యనారాయణరాజు అన్నారు. మండలంలోని పోలవరంలో మంగళవారం బడికి పోతా ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయులు, నాయకులు ఇంటింటికి వెళ్ళి, ప్రభుత్వ పాఠశాలలో అర్హతకలిగిన ఉపాధ్యాయులతో నాణ్యమైన బోధన, ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్, పోషక విలువలు కలిగిన మధ్యాహ్న భోజనం తదితర సదుపాయాలుంటాయని తల్లిదండ్రులకు వివరించి విద్యార్థులను బడిలో చేర్చుకున్నారు. అనంతరం అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు నాయకులు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. కృష్ణారావుపాలెం స్కూల్‌లో ఎంపీటీసీ చింతగుంట్ల వెంకటేశ్వరరావు, తుమ్మగూడెం ఉర్దూ పాఠశాలలో విద్యా కమిటీ చైర్మన్ జహేద విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. హెచ్ఎంలు ఆర్. నాగేశ్వరరావు, వెంకట్రావు, టీడీపీ నాయకులు యర్రా హేమంత కుమార్, ప్రసాదరావు, శ్రీనివాసరావు, సీతారామయ్య, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు ప్రభుత్వ పాఠ్య పుస్తకాల పంపిణీ జరిగింది. కూటమి నాయకులు ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఈ కార్యక్రమంలో హెచ్ఎం పుష్పలత సమస్యలు వివరించారు. గత ప్రభుత్వం గ్రాంట్స్ విడుదల చేయలేదని నాయకులు చొరవ తీసుకుని నిధులు విడుదలకు సహకరించాలని సూచించారు. ఆగిరిపల్లి సర్పంచ్ లక్ష్మీవిక్టర్ స్పందించి సకాలంలో నిధులు విడుదలయ్యేలా పైఅధికారులకు తెలియజేస్తానన్నారు. ఎంఈవో సర్వేశ్వరరావు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల 68 ఉన్నాయని, 8 వేల మంది విద్యార్థులు 124 మంది టీచర్లు ఉన్నారని అయితే ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు గణనీయంగా తగ్గిపోతున్నాయన్నారు. ఎంఈవో 2 ఆనంద్ సమస్యలు తెలిపారు. టీడీపీ నాయకులు మల్లవల్లి కోటేశ్వరరావు, పాముర్తి నరసింహారావు, బీజేపీ నాయకుడు కొవ్వలి బాబురావు, జనసేన నాయకుడు జలసూత్రం పవన్ పాల్గొన్నారు.



ఆగిరిపల్లి జడ్పీ హైస్కూల్‌లో పుస్తకాల పంపిణీ



ఎంఅండ్‌కే ప్రధాన రహదారిపై నేలకొరిగిన తాటిచెట్టు

ఈదురు గాలులు.. వర్షం

నూజివీడు టౌన్, జూన్ 18: నూజివీడు మండలంలో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులతో వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత ఉండగా, సాయంత్రం 4 గంటల నుంచి ఆకాశం మేఘావృతమై ఒక్కసారిగా ఈదురు గాలులతో వర్షం కురిసింది. నూజివీడు మండలం పల్లెర్లమూడి, మీర్జాపురం, గొల్లపల్లి, మొర్సపూడి తదితర గ్రామాల్లో వర్షం కురిసింది. ఈదురు గాలులకు ఎమ్అండ్‌కె రహదారిపై తాటిచెట్టు నేలకొరగడంతో ట్రాఫిక్‌కు కొద్దిసేపు నిలిచింది. కాగా నూజివీడు పట్టణం, మండలంలోని అధిక గ్రామాల్లో పొడి వాతావరణం నెలకొంది. రుతుపవనాలు ప్రవేశించినా ఎండ వేసవిని తలపించేలా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అనర్హులకు దివ్యాంగ పింఛన్లపై ఫిర్యాదు

నూజివీడు, జూన్ 18: నూజివీడు మండలంలో దివ్యాంగ పింఛన్లపై విచారణ నిర్వహించి, అర్హులైన వారికి మాత్రమే అందేలా చర్యలు చేపట్టాలని, నూజివీడు మండలం తూర్పుదిగవల్లి ఉప సర్పంచ్ జగ్గవరపు వెంకటరెడ్డి నూజివీడు ఆర్డీవో వై.భవానీ శంకరిని కోరారు. తూర్పుదిగవల్లిలో వైసీపీ హయాంలో అనర్హులకు దివ్యాంగ పింఛన్‌లను మంజూరుచేశారని, ఫలితంగా అర్హులైన వారికి న్యాయబద్ధంగా పింఛన్లు అందకుండా పోతున్నాయన్నారు. గ్రామంలో దాదాపు పది మంది అనర్హులు దివ్యాంగ పింఛన్లు తీసుకుంటున్నారని, విచారణ జరిపి బాధ్యుల పై చర్యలు తీసుకోవడంతో పాటు అనర్హుల పింఛన్ రద్దుచేసి వారి నుంచి సొమ్ము రికవరీ చేయాలని ఆయన కోరారు.

22న దివ్యాంగుల నిర్ధారణ శిబిరం



ముసునూరు, జూన్ 18: నూజివీడు జడ్పీ బాలుర పాఠశాలలో ఈ నెల 22న దివ్యాంగుల నిర్ధారణ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తామని ఎంపీడీవో సీహెచ్. పద్మావతిదేవి అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆమె వైద్య శిబిరం పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడుతూ పంచాయతీల కార్యదర్శు లు, సచివాలయ సిబ్బంది సంయుక్తంగా గ్రామాల్లో ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించి, వారిని వైద్యశిబిరానికి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. దివ్యాంగుల నిర్ధారణ వైద్య శిబిరం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుందని, భోజన వసతి కూడా ఉంటుందని తెలిపారు. దివ్యాంగుల తల్లిదండ్రులు ఈ వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకుని, ప్రభుత్వం అందిస్తున్న ఉచిత సౌకర్యాలు, ఉప కరణాలను పొందాలని కోరారు. ఐఈఆర్టీలు లక్ష్మీనారాయణ, నాగమల్లీశ్వరి, సీనియర్ అసిస్టెంట్ సగ్గుర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మొక్కు తీర్చుకున్న టీడీపీ కార్యకర్త



ముసునూరు, జూన్ 18: కూటమి అఖండ విజయం సాధించడం, నూజివీడులో టీడీపీ జెండా ఎగురవేసి, కొలుసు పార్థసారథి మంత్రి పదవిని చేపట్టడంతో టీడీపీ కార్యకర్త తన మొక్కు తీర్చుకున్నాడు. ముసునూరు మండలం చెక్కపల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్య కర్త, దివ్యాంగుడు షేక్ నాగూర్ ద్వారకా తిరుమలకు పాదయాత్రగా వెళ్ళి మంగళవారం తిరుమలేశుడికి మొక్కు చెల్లించాడు. చంద్రబాబు పాలనలో నవ్యాంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి సాధించాలని తిరుమలేశుడికి కోరుకున్నట్లు నాగూర్ తెలిపాడు.



కాలినడకన ద్వారకాతిరుమలకు తెలుగు మహిళలు

చాట్రాయి, జూన్ 18: నూజివీడు ఎమ్మెల్యే కొలుసు పార్థసారధి మంత్రిగా, చంద్రబాబు ముఖ్య మంత్రిగా పదవులు చేపడితే కాలినడకన ద్వారకా తిరుమల శ్రీవారి దర్శనానికి కాలినడకన వస్తామని, జనార్దనవరం గ్రామ తెలుగు మహిళలు మొక్కుకున్నారు. ఆ మేరకు మంగళవారం జిల్లా తెలుగు మహిళా నాయకురాలు మాదాసు చంద్రకళ ఆధ్వర్యంలో 20 మంది తెలుగు మహిళలు గోవింద నామస్మరణ చేసుకుంటూ ద్వారకా తిరుమల బయలుదేరి వెళ్ళారు.

కాళ్లపాలెం డాక్టర్ విగ్రహావిష్కరణ



కైకలూరు, జూన్ 18: కాళ్ల పాలెం డాక్టర్ గారి సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కైకలూరు మండలం అగ్రహారంలో దివంగత ప్రముఖ వైద్యుడు కాళ్లపాలెం డాక్టర్ బత్తిన నరసింహారావు విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడుతూ ఏమీ ఆశించకుండా అనేక మంది పేదలకు ప్రాణ దానం చేశారన్నారు. ఆయన మృతి కైకలూరు ప్రాంత ప్రజలకు తీరని లోటన్నారు. ఆయన గుర్తుగా అగ్రహారం ప్రజలు విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. కాళ్లపాలెం డాక్టర్ గారి సతీమణి డాక్టర్ అరుణ, కుమారుడు డాక్టర్ వంశీకిరణ్, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, రాష్ట్ర గౌడ సంఘం నాయకుడు పోసిన చెంచు రామారావు, టీడీపీ నేతలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

ముసునూరు, జూన్ 18: విద్యార్థులకు మెనూ ప్రకారం రుచితో కూడిన నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఎంఈవో బీవీ సుబ్బారావు అన్నారు. మంగళవారం కాట్రేనిపాడులోని జడ్పీ పాఠశాలతోపాటు మరో రెండు పాఠశాలల్లో ఆయన ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. మెనూ అమలు, రుచిపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనంలో ఎటువంటి అవకతవకలకు పాల్పడిన, నాణ్యత, రుచిపై ఫిర్యాదులు వచ్చినా ఏజన్సీలను రద్దు చేస్తామని ఎంఈవో హెచ్చరించారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

సబ్సిడీపై సార్వా విత్తనాలు సిద్ధం

ముదినేపల్లి, జూన్ 18 : ముదినేపల్లి మండలంలోని అన్ని ఆర్బీకేల్లో వరి విత్తనాలు సబ్సిడీపై విక్రయించేందుకు సిద్ధం చేసినట్లు మండల వ్యవసాయాధికారి కె.వేణుమాధవ్ తెలిపారు. మండలంలోని 21 ఆర్బీకేల్లో 350 క్వింటాళ్ల వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. స్వర్ణ, 1318, 1061 రకం వరి విత్తనాలను కేజీ ఒక్కింటికి రూ.5 లకు సబ్సిడీపై విక్రయిస్తున్నట్లు తెలిపారు. పై మూడు రకాల విత్తనాలు 30 కేజీల బస్తా ఒక్కింటికి సబ్సిడీ పోను రూ.1044కు విక్రయిస్తున్నట్లు ఏవో తెలిపారు.